# సోమవారాల్లో హార్ట్ అటాక్ సంభవిస్తున్నదా?!

ఇటీవల గుండెపోటుతో కుప్పకూలిన వ్యక్తుల వీడియోలు నెట్టింట్లో వైరల్ కావడం, నృత్యం చేస్తూ నేలకొరగడం, పెళ్లి కూతురు ఉన్నట్లుండి పడిపోవడం, జిమ్‌లో కుప్పకూలిపోవడం, నవ యువకులు గుండె పేటుకు బలికావడం చూసి భయకంపితులం అవుతున్నాం. గుండెలోని రక్తనాళాలు పూడుకుపోవడం, రక్త ప్రసరణలో తీవ్ర అడ్డంకులు ఏర్పడడం, గుండె రక్తాన్ని సరిగా సరఫరా చేయలేకపోవడం లాంటి కారణాలతో గుండె పోటు అవకాశాలు పెరుగుతున్నట్లు వైద్య నిపుణులు వివరిస్తున్నారు. అత్యధికుల్లో తీవ్రమైన గుండె పోటు లేదా గుండె జబ్బులు వారం ఆరంభ దినమైన సోమవారాల్లో ఎక్కువగా వస్తున్నట్లు తాజా పరిశోధనలు, అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2013 – 18 మధ్య 'బ్రిటీష్ కార్డియోవాస్క్యులార్ సొసైటీ, బిసిఎస్' నిర్వహించిన పరిశోధనల్లో 10,000కు పైగా రోగుల వివరాలను అధ్యయనం చేసి తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## బ్లూ మండే – నాచురల్ స్లీప్ వేక్ సైకిల్:

'నీలి సోమవారం' లేదా 'బ్లూ మండే' రోజున మాత్రమే గుండె పోటు అధికంగా సంభవించడానికి కచ్చితమైన కారణాలు ఏమీ ఇప్పటికీ తెలియనప్పటికీ సోమవారాల్లో గుండె పోటుకు గురైన వ్యక్తులు ఎక్కువగా ఉండడం గమనించారు. ఆదివారం సెలవు దినం కావడంతో దిన చర్యలో, ఆహార పదార్థాలు తీసుకోవడంలో మార్పులు ఉండడం కారణం కావచ్చని అంచనా వేస్తున్నారు. సోమవారం సాధారణ దినచర్యలో కొన్ని మార్పు ఉండడం, ఆలస్యంగా నిద్ర లేవడం (నాచురల్ బాడీ స్లీప్ – వేక్ సైకిల్ లేదా సర్కేడియన్ రిథమ్), వ్యాయామ సమయంలో మార్పులతో విధులకు వెళ్లడానికి త్వర త్వరగా తయారవుతూ హైరానా పడడం లాంటి పలు ఒత్తిడిల వల్ల గుండె పోటు అధికుల్లో నమోదు (సర్కేడియన్ రిథమ్) అవుతున్నదని విశ్లేషిస్తున్నారు.

## వయసుతో నిమిత్తం లేదు:

యూకెలో నిర్వహించిన అధ్యయనంలో ఆసుపత్రిలో చేరిన 30,000 మంది గుండె పోటు రోగుల వివరాల ప్రకారం అత్యధికంగా సోమవారాల్లో హార్ట్ అటాక్ రావడం, తరువాత ఆదివారం కూడా ఎక్కువ కేసులు నమోదు కావడం, వారికి అత్యవసర ఆంజియోప్లాస్టీ చేసి వివరాలు వెల్లడించారు. "అమెరికన్ హార్ట్ అసోసియేషన్" వివరాల ప్రకారం డిసెంబర్ చివరి వారాల్లో, శీతాకాలం ఉదయాన గుండె పోటుతో అధిక జనులు మరణిస్తున్నట్లు తేల్చారు. వయసుతో నిమిత్తం లేకుండా గుండె నొప్పి రావడం, క్షణాల్లో ప్రాణాలు పోవడం చూస్తున్నాం. 'ఎస్‌టి–సెగ్మెంట్ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (ఎస్‌టిఈఎంఐ)' కారణంగా కరోనరీ ఆర్టరీ పూర్తిగా మూసివేయబడి గుండె పోటు వస్తున్నట్లు పరిశోధనల ఫలితాలు తెలుపుతున్నాయి.

## అధిక గుండె పోటుకు కారణాలు:

అధిక రక్త పోటు, అధిక కొలెస్టరాల్, ధూమపానం, ఆల్కహాల్ సేవనం, మాదక ద్రవ్యాల వినియోగం, గుండె జబ్బుల కారణాలతో గుండె పోటు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని తెలుస్తున్నది. సాధారణ శారీరక శ్రమ, పోషకాహారం తీసుకోవడం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం, శరీర బరువును నియంత్రించడం, రక్తపోటు/కొలెస్టరాల్/ మధుమేహం అదుపులో ఉంచుకోవడం వల్ల గుండె పోటు సమస్య తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు.

## గుండె పోటు రోగ లక్షణాలు:

ఛాతిపై ఒత్తిడి, అకారణంగా అలసటగా అనిపించడం, కడుపు ఉబ్బినట్లు ఉండడం, నడుం నొప్పి అనిపించడం, కడుపులో తీవ్రమైన నొప్పి, కడుపులో గ్యాస్ పెరిగినట్లు అనిపించడం, ఎడమ చేతిలో నొప్పి,తచెమటలు రావడం, గుండె నుంచి వెన్ను వైపుగా నొప్పి కదులుతున్నట్లు అనిపించడం, గొంతులో ఇబ్బంది అనిపించడం, భుజాల్లో అసౌకర్యం, మెడ/ దవడల నొప్పులు, శ్వాస ఇబ్బందులు, బలహీనంగా కనిపించడం లాంటి రోగ లక్షణాలు గుండె పోటుకు హెచ్చరికగా తీసుకోవాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# భారతదేశం తన కార్మిక శక్తికి సామాజిక భద్రతతో పాటు తగిన యోగ్యమైన పనిని అందించాలనే నిబద్ధతతో అమృత్‌కాల్ వైపు పయనిస్తోంది



న్యూఢిల్లీ, జూన్ 15:జెనీవాలో 2023 జూన్ 13న జరిగిన 111వ అంతర్జాతీయ కార్మిక సదస్సులో కేంద్ర కార్మిక, ఉపాధి, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ప్లీనరీ సెషన్‌లో ప్రసంగించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం తన శ్రామిక శక్తికి సామాజిక భద్రత, మంచి పనిని అందించాలనే నిబద్ధతతో అమృత్‌కాల్ దిశగా పయనిస్తోందని ఆయన అన్నారు.

భారతదేశం తన జి20 ప్రెసిడెన్సీ ద్వారా దేశాల మధ్య నైపుణ్యాల అంతరాలను మ్యాప్ చేయడానికి, నైపుణ్యాలు, అర్హతలను సమన్వయం చేయడం, పరస్పర సహకారం అందించే లక్ష్యం పెట్టుకుందని శ్రీ యాదవ్ చెప్పారు.

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులతో సహ అందరికీ సార్వత్రిక, సమగ్రమైన సామాజిక భద్రతా కవరేజీని అందించడానికి స్థిరమైన ఫైనాన్సింగ్ మెకానిజమ్‌ల కోసం మార్గాలను కనుగొనడానికి ప్రపంచంతో కలిసి పనిచేయాలని భారతదేశం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి చెప్పారు.

ఇంటర్నేషనల్ లేబర్ కాన్ఫరెన్స్ సందర్భంగా శ్రీ యాదవ్ ఐఎల్‌ఓ డీజీ గిల్బర్ట్ హౌంగ్బోను కూడా కలిశారు. గ్లోబల్ స్కిల్ గ్యాప్స్, గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ ఎకానమీ, సోషల్ ప్రొటెక్షన్, సస్టైనబుల్ ఫైనాన్సింగ్ ఫర్ సోషల్ సెక్యూరిటీకి సంబంధించిన ఈడబ్ల్యుజి ప్రాధాన్యతా ప్రాంతాల గురించి భారతదేశం జి 20 ప్రెసిడెన్సీలో చర్చించారు.

# ఎన్‌హెచ్‌పిసి డైరెక్టర్ (సిబ్బంది)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఉత్తమ్ లాల్

న్యూఢిల్లీ, జూన్ 15:భారతదేశ అగ్రగామి జలవిద్యుత్ కంపెనీ అయిన ఎన్‌హెచ్‌పిసి లిమిటెడ్ డైరెక్టర్ (సిబ్బంది)గా శ్రీ ఉత్తమ్ లాల్ బాధ్యతలు స్వీకరించారు.

ఎన్‌హెచ్‌పిసిలో నియామకానికి ముందు, శ్రీ లాల్ ఎన్‌టిపిసి లిమిటెడ్‌లో చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్– సిఎస్‌ఆర్/ ఆర్‌ఢ ఆర్/ ఎల్‌ఎ)గా విధులను నిర్వహించారు. సుదీర్ఘమైన 35 ఏళ్ళ వృత్తి జీవితంలో ఆయనకు పర్సనల్ మేనేజ్‌మెంట్, పారిశ్రామిక సంబంధాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత వంటి అంశాలలో ఆయనకు సుసంపన్నమైన, విస్తృత అనుభవం ఉంది. విద్యుత్ రంగంలో ఆయనకు గల నైపుణ్యం, దీర్ఘ అనుభవం కారణంగా ప్రాచుర్యం పొందిన ఆయన, సంస్థ లక్ష్యం, దృక్పథ సేవలో మానవ వనరుల సామర్థ్యాన్ని సమ్మిళితం చేయాలని యత్నిస్తున్న ఒక ప్రముఖ హెచ్‌ఆర్ ప్రొఫెషనల్.

పర్సనల్ మేనేజ్‌మెంట్ ఢ పారిశ్రామిక సంబంధాలలో గ్జేవియర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (రాంచి) నుంచి శ్రీ లాల్ పిజి డొప్లొమాను పొందారు. ఆయన రాంచీ యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బి పట్టాను కూడా ఆయన పొందారు.

# 198 మంది అథ్లెట్లు సహా 280 మంది సభ్యులతో కూడిన భారత బృందం స్పెషల్ ఒలింపిక్స్ - సమ్మర్ గేమ్స్

న్యూఢిల్లీ, జూన్ 15:198 మంది అథ్లెట్లు సహా 280 మంది సభ్యులతో కూడిన భారత బృందం, ఈ నెల 12 న, జర్మనీలోని బెర్లిన్ లో స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ గేమ్స్‌లో పాల్గొనడానికి బయలుదేరింది.

బెర్లిన్ బయలుదేరడానికి ముందు, ఈ నెల 8న జరిగిన వీడ్కోలు వేడుకలో కేంద్ర యువజన వ్యవహారాలు ఢ క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్‌ను కలిసే అవకాశం కూడా జట్టుకు లభించింది.

స్పెషల్ ఒలింపిక్స్‌లో భారత బృందం పాల్గొనడానికి రూ.7.7 కోట్లు కేటాయించారు. ఇది, ఇప్పటి వరకు ఈవెంట్ కోసం మంజూరు చేసిన అత్యధిక మొత్తం.190 దేశాల నుంచి 7000 మంది అథ్లెట్లు పాల్గొనే ప్రపంచ స్థాయి క్రీడల పోటీల కోసం సిద్ధం కావడానికి ఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సన్నాహక శిక్షణ శిబిరం కూడా నిర్వహించారు.ఈ నెల 17 నుంచి 25 వరకు జరిగే ఈ ప్రపంచ స్థాయి క్రీడల పోటీల్లో, 16 రకాల క్రీడా విభాగాల్లో భారత అథ్లెట్లు పతకాల కోసం పోరాడతారు.

# జూన్ 15 నుంచి 17 వరకు హైదరాబాద్‌లో జి 20 వ్యవసాయ మంత్రుల స్థాయి (అగ్రికల్చర్ మినిస్టీరియల్ ) సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 15:అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్ (ఎడబ్ల్యూజీ) మినిస్టీరియల్ సమావేశాలకు హైదరాబాద్ సిద్ధం అయింది. 2023 జూన్ 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాల వ్యవసాయ మంత్రులు, అంతర్జాతీయ సంస్థల డైరెక్టర్స్ జనరల్ పాల్గొంటారు.

మొదటి రోజు, గౌరవ కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి శ్రీ కైలాష్ చౌదరి ఒక ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో భారత్ సాధించిన విజయాలను ఈ ఎగ్జిబిషన్ లో ప్రదర్శిస్తారు. ప్రారంభోత్సవం అనంతరం వ్యవసాయ డిప్యూటీస్ మీటింగ్ (ఏడీఎం) జరుగనుంది. ద్వితీయార్థంలో అగ్రిబిజినెస్ ఫర్ ప్రాఫిట్, పీపుల్ అండ్ ప్లానెట్ నిర్వహణ, డిజిటల్లీ డిస్కనెక్ట్: వ్యవసాయంలో డిజిటల్ సాంకేతిక తల శక్తిని ఉపయోగించుకోవడం' అనే రెండు కార్యక్రమాలు కూడా జరుగుతాయి. వ్యవసాయ వాణిజ్య కంపెనీలను ప్రోత్సహించడంలో అగ్రశ్రేణి భారతీయ వ్యవసాయ ఆధారిత కంపెనీలు, స్టార్టప్‌లు , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యం ఉంటుంది.

రెండవ రోజు సమావేశం గౌరవ కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్, జి 20 సమావేశంలో పాల్గొనే మంత్రులు,ఇతర ప్రతినిధి బృందాల నాయకులకు స్వాగతం పలకడంతో ప్రారంభమవుతుంది. ఆహార భద్రత, పౌష్టికాహారం కోసం సుస్థిర వ్యవసాయం, మహిళల నేతృత్వంలోని వ్యవసాయం, సుస్థిర జీవవైవిధ్యం, వాతావరణ పరిష్కారాలపై ఉన్నత స్థాయి మంత్రుల చర్చలు మూడు సమాంతర సెషన్లలో జరుగుతాయి.

మూడవ రోజు భారత్ అధ్యక్షతన అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్, జి 20 ఫలితాలను ఆమోదించడంతో మంత్రుల సమావేశం ముగుస్తుంది. అనంతరం ప్రతినిధి వర్గం హైదరాబాద్ లోని ఐసీఏఆర్ –ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్ )కు సాంకేతిక విజ్ఞాన యాత్రకు వెళతారు.

# ఆదివాసీ పల్లెలు ప్రకృతి నిలయాలు : కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్, జూన్ 15: శుచి శుభ్రతను పాటిస్తూ జీవనం సాగించే ఆదివాసీ పల్లెలు ప్రకృతి నిలయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని అంబుగమ గ్రామంలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొదటి సారిగా గ్రామానికి వచ్చిన కలెక్టర్ కు ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా ఉన్న కొమురం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేసి ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ అంబుగమ గ్రామంలో చేసిన అభివృద్ధి పై వివరించారు.



గ్రామ సమస్యలు కలెక్టర్ దృష్టికి ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని అంబుగమ గ్రామ పంచాయతీ నూతన పంచాయతీగా ఏర్పడినప్పటికి గ్రామానికి త్రీఫెజ్ కరెంట్, తాగు నీటి ఇబ్బంది, మిషన్ భగీరథ నీరు అందక పోవడంతో ఎండాకాలం వచ్చిందంటే ఇబ్బందులు తప్పవని తాంసి మండల్ తుడుం దెబ్బ అధ్యక్షుడు భరత్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు.అదే విధంగా గ్రామానికి చెరువు పూడిక తీయక పోవడంతో 600 ఎకరాలు సాగుకు నోచుకోవడం లేదని వివరించారు.సమస్య లపై స్పందించిన కలెక్టర్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తూర్పా భాయి యశ్వంత్, ఎంపీపీ మంజుల, పీఏసిఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ ఆకుల భూమయ్య, ఆదివాసీ తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం భరత్, గ్రామ పటేల్ ఆత్రం మలకు, మహాజన్ మేస్రం శంబాజి, కుంర కేషో రావు, గడ్డం భూమరెడ్డి, దుర్వ భీంరావు, మండల అధికారులు, ఆయా గ్రామ సర్పంచ్ లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చీపురుపల్లిలో మంత్రి బొత్స.. పలు అభివృద్ధి కార్యక్రమాలకి శంఖుస్థాపన



విజయనగరం, జూన్ 15: చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స సత్యనారాయణ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా గరివిడిలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన చీపురుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనాన్ని ప్రారంభించారు మంత్రి.రూ.16 లక్షలతో చీపురుపల్లి లో నిర్మించనున్న డిజిటల్ లైబ్రరికి శంకుస్థాపన చేశారు. చీపురుపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ లెర్నింగ్ ప్యానల్ ను ప్రారంభించారు. చీపురుపల్లి లో నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్నారు మంత్రి బొత్స. పదో తరగతి, ఇంటర్ లో టాప్ ర్యాంక్ కు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం, మెడల్, జ్ఞాపికలు బహూకరించారు బొత్స.విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను శాలువాతో సత్కరించారు బొత్స .. అనంతరం రాష్ట్రంలోని విద్యార్థులు అందరిలో స్ఫూర్తిని కలిగించే లక్ష్యంతో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టామన్నారు. డిజిటల్ విద్యా విధానంతో ప్రపంచంతో పోటీ పడే విధంగా మన విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ వారి తల్లిదండ్రుల కంటే మిన్నగా సీఎం జగన్ వారి బాగోగులు చూసుకుంటున్నారని తెలిపారు. ఈ ఏడాది జగన్ పుట్టినరోజుకి మళ్లీ విద్యార్థులకు టాబ్ లు పంపిణీ చేస్తాం.. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో రెండో ఎం.ఇ.ఓ. పోస్టు మంజూరు చేశాం.. అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి ఎస్, డి.ఇ.ఓ. లింగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చుక్కమ్మకు నివాళులర్పించిన పొంగులేటి వర్గ నేతలు



ఖమ్మం, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి): కొణిజర్లమండలం చిన్నమునగాల గ్రామానికి చెందిన కాంపల్లి చుక్కమ్మ గుండె నొప్పితో మృతి చెందింది. వారి పార్థీవదేహానికి నివాళులు అర్పించిన పెద్దమునగాల గ్రామసర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్, పోనాటి బాబురావు, పాపకంటి చిన్నబాబు, చిన్నమునగాల గ్రామ సర్పంచ్ కాంపల్లి స్వప్న–సురేష్, నరేంద్ర నాయుడు, యూత్ అధ్యక్షుడు రంజిత్, పదిమల నరేష్, మరికంటి ఎల్లయ్య, కావూరి శ్రీను, బంక రత్తయ్య, కాంపెల్లి చుక్కయ్య, పాపగంటి బెంజిమెన్, పాపకంటి జనార్దన్ రావు, మురళి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# మహిళలకు అందరికి ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం - రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 15:కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన ఎంపీ కార్యాలయంలో కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో ఆదిలాబాద్, షాద్‌నగర్, ఉప్పల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నేతలకు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇల్లు కట్టుకునే పేదలకు 5లక్షల సాయంతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా రైతులకు 2లక్షల రుణమాఫీ, 500రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డల కష్టాలు తీరుస్తామని వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పిస్తామన్నారు.

అదిలాబాద్ రాజకీయాల గురించి మాట్లాడుతూ, జోగు రామన్నను జోకుడు రామన్న అంటే బాగుంటదన్నారు. జోగు రామన్న చెల్లని రూపాయని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్న రేవంత్? అందుకే ఆయనకు మళ్లీ మంత్రి పదవి ఇవ్వవలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని ఆయన ధ్వజమెత్తారు. మరోసారి సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని వ్యాఖ్యానించారు.

# ఉత్పత్తి పెరుగుదలకు, ఉపాధి కల్పనకు, ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తున్న పి ఎల్ ఐ పథకాలు

న్యూఢిల్లీ, జూన్ 15:ఉత్పాదకత తో ముడి పెట్టిన ప్రోత్సాహక (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ –పీఎల్ఐ) పథకాలు దేశంలో ఉత్పత్తి, ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి, ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదలకు దారితీశాయి. పీఎల్ ఐ పథకాల కారణంగా 2020–21 ఆర్థిక సంవత్సరం (12.09 బిలియన్ డాలర్లు)తో పోలిస్తే 2021–22 ఆర్థిక సంవత్సరంలో తయారీ రంగంలో ఎఫ్ డీఐలు గణనీయంగా 76 శాతం (21.34 బిలియన్ డాలర్లు) పెరిగాయని డీపీఐఐటీ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ ఢిల్లీ లో విలేకరుల సమావేశంలో తెలిపారు.

భారతదేశాన్ని 'ఆత్మనిర్భర్'గా మార్చే లక్ష్యంతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశించిన విధంగా పిఎల్ఐ పథకాలు 1.97 లక్షల కోట్ల రూపాయల (సుమారు 26 బిలియన్ అమెరికన్ డాలర్లు) ప్రోత్సాహక వ్యయంతో 14 రంగాల పునాదిపై వాటి ఉత్పత్తి సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, గ్లోబల్ ఛాంపియన్‌లను సృష్టించేందుకు నిర్మించబడ్డాయి.

2021–22 ఆర్థిక సంవత్సరం నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు పీఎల్ఐ పథకాలు ఉన్న, ఎఫ్ డి ఐ ల ప్రవాహం పెరిగిన రంగాల్లో డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ (+46%), ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ (+26%), మెడికల్ అప్లయెన్సెస్ (+91%) ఉన్నాయి. పిఎల్ఐ పథకాలు భారతదేశ ఎగుమతుల బుట్టను సాంప్రదాయ వస్తువుల నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ వస్తువులు, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులు వంటి అధిక విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చాయి.

ఇప్పటి వరకు 14 రంగాల్లో రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులతో 733 దరఖాస్తులకు ఆమోదం లభించింది. బల్క్ డ్రగ్స్, మెడికల్ డివైజెస్, ఫార్మా, టెలికాం, వైట్ గూడ్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్టైల్స్ అండ్ డ్రోన్స్ వంటి రంగాల్లో 176 ఎంఎస్ఎంఈలు పీఎల్ఐ లబ్ధిదారుల్లో ఉన్నాయి.

2023 మార్చి వరకు వాస్తవంగా రూ.62,500 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఫలితంగా రూ.6.75 లక్షల కోట్లకు పైగా ఉత్పత్తి, అమ్మకాలు పెరిగాయని, సుమారు 3,25,000 మందికి ఉపాధి లభించిందని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు రూ.2.56 లక్షల కోట్లు పెరిగాయి.

2022–23 ఆర్థిక సంవత్సరంలో పీఎల్ఐ పథకాల కింద 8 రంగాలైన లార్జ్ స్కేల్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఎల్ఎస్ఈఎం), ఐటీ హార్డ్వేర్, బల్క్ డ్రగ్స్, మెడికల్ డివైజెస్, ఫార్మాస్యూటికల్స్, టెలికాం అండ్ నెట్వర్కింగ్ ప్రొడక్ట్స్, ఫుడ్ ప్రాసెసింగ్, డ్రోన్లు, డ్రోన్ కాంపోనెంట్స్ కింద రూ.2,900 కోట్ల ప్రోత్సాహక మొత్తాన్ని పంపిణీ చేశారు.

పిఎల్ఐ స్కీమ్ ప్రధాన స్మార్ట్ ఫోన్ కంపెనీలు తమ సరఫరాదారులను భారతదేశానికి తరలించడానికి దారితీసింది, ఉదా: ఫాక్స్కాన్, విస్ట్రాన్ పెగాట్రాన్. ఫలితంగా టాప్ హైఎండ్ ఫోన్లు ఇండియాలో తయారవుతున్నాయి.

దీని ఫలితంగా బ్యాటరీ , ల్యాప్ టాప్ లు వంటి ఐటి హార్డ్ వేర్ లో మహిళల ఉపాధి, స్థానికీకరణ 20 రెట్లు పెరిగింది. భారత్ లో మొబైల్ తయారీలో విలువ జోడింపు 20 శాతం వరకు ఉందని డీపీఐఐటీ కార్యదర్శి తెలిపారు. మొబైల్ తయారీలో విలువను 3 సంవత్సరాల వ్యవధిలో 20 శాతానికి పెంచగలిగామని, వియత్నాం వంటి దేశాలు 15 సంవత్సరాలలో 18% విలువ జోడింపును సాధించాయని, చైనా 25 సంవత్సరాలలో 49% విలువ జోడింపును సాధించిందని అన్నారు. ఈ కోణంలో చూస్తే, ఇది ఒక పెద్ద విజయం అని శ్రీ రాజేష్ కుమార్ సింగ్ అన్నారు.

ప్రస్తుతమున్న దశలవారీ తయారీ కార్యక్రమం (పిఎంపి)తో పాటు ఎల్ఎస్ఇఎమ్ కోసం పిఎల్ఐ పథకం ఎలక్ట్రానిక్స్ రంగంలో , స్మార్ట్ ఫోన్ తయారీలో 2014–15 లో నామమాత్రంగా ఉన్న విలువ జోడింపును వరుసగా 23%, 20% పెంచడానికి దారితీసింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 101 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో స్మార్ట్ ఫోన్లు 44 బిలియన్ డాలర్లు, ఎగుమతులు 11.1 బిలియన్ డాలర్లు ఉన్నాయి.

టెలికాం రంగంలో 60% దిగుమతి ప్రత్యామ్నాయం సాధించబడింది యాంటెనా, జిపిఒఎన్ (గిగాబిట్ పాసివ్ ఆప్టికల్ నెట్ వర్క్) ,సిపిఇ (కస్టమర్ ప్రాంగణ పరికరాలు) లలో భారతదేశం దాదాపు స్వయం సమృద్ధి సాధించింది. అన్ని ఎంఎస్ఎంఇ స్టార్టప్ లను కలిగి ఉన్న పిఎల్ఐ పథకం కారణంగా డ్రోన్ల రంగం టర్నోవర్ 7 రెట్లు పెరిగింది.

పిఎల్ఐ స్కీమ్ ఫర్ ఫుడ్ ప్రాసెసింగ్ కింద, భారతదేశం నుండి ముడి పదార్థాల సోర్సింగ్ గణనీయమైన పెరుగుదలను చూసింది, ఇది భారతీయ రైతులు, ఎంఎస్ఎంఈల ఆదాయాన్ని సానుకూలంగా ప్రభావితం చేసింది.

పీఎల్ఐ పథకం కారణంగా ఫార్మా రంగంలో ముడి పదార్థాల దిగుమతులు గణనీయంగా తగ్గాయి. పెన్సిలిన్–జితో సహా ప్రత్యేకమైన ఇంటర్మీడియట్ మెటీరియల్స్ ,బల్క్ డ్రగ్స్ భారతదేశంలో తయారు అవుతున్నాయి. సిటి స్కాన్, ఎంఆర్ఐ మొదలైన వైద్య పరికరాల తయారీలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ జరిగింది.

# కేంద్ర హోంమంత్రి అమిత్ తెలంగాణ పర్యటన వాయిదా!?

హైదరాబాద్ జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కేంద్ర హోంమంత్రి అమిత్ తెలంగాణ పర్యటన వాయిదాపడే అవకాశాలున్నాయి. షెడ్యూల్ ప్రకారం బుధవారం రాత్రే అమిత్ షా హైదరాబాద్ చేరుకోవాల్సి ఉన్నప్పటికీ బిపర్‌జోయ్ తుఫాను కారణంగా పర్యటన వాయిదా వేసుకోవాలనే భావనలో ఉన్నట్టు తెలుస్తోంది. బిపర్‌జోయ్ తుఫాన్ ప్రధానంగా గుజరాత్‌పై తీవ్రమైన ప్రభావం చూపుతుందనే అంచనాల నేపథ్యంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఈ కారణంగానే అమిత్ షా తెలంగాణ పర్యటనపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. రేపటి తెలంగాణ పర్యటన ఉంటుందా? లేదా? అన్న సందిగ్ధం నెలకొంది. ఢిల్లీ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో నేతలు ఎటూ తేల్చుకోలేక మీమాంసలో పడ్డారు.

కాగా.. పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్‌లో చేరిక వార్తలు.. తెలంగాణలో నెలకొన్న ఆసక్తికర రాజకీయ పరిణామాల నేపథ్యంలో అమిత్ షా తెలంగాణ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకున్న విషయం తెలిసిందే. అమిత్ షా పర్యటనకు సంబంధించి హైదరాబాద్, భద్రాచలం, ఖమ్మం పర్యటనలతో బిజీ బిజీ షెడ్యూల్ కూడా ఖరారైంది. రాష్ట్ర నేతలు కూడా అందుకు తగినట్టుగా ఏర్పాట్లు కూడా చేసేశారు. కానీ తుఫాన్ రూపంలో వారి ఆశలు గల్లంతు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కనీసం ఖమ్మం సభకైనా నేరుగా రావాలంటూ రాష్ట్ర బీజేపీ నేతలు కోరుతున్నారని తెలుస్తోంది. కానీ కేంద్ర హోంమంత్రి కార్యాలయం మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడంతో ఆశలు సన్నగిల్లుతున్నాయి. మరోవైపు రేపే (గురువారం) బిపర్‌జోయ్ తుఫాను తీరం దాటనుంది. దీని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. 120-150 కి.మీ వేగంతో గాలులు కూడా వీచే ప్రమాదం ఉందని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అమిత్ షా తెలంగాణ పర్యటన వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# సీఎం, డీసీఎంలు సహా 36 మంది కాంగ్రెస్ నేతలకు కోర్టు సమన్లు

బెంగళూరు, జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); సీఎం సిద్ద రామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తోపాటు 36మంది కాంగ్రెస్ ముఖ్యులకు కోర్టు సమన్లు జారీ చేసింది. బెం గళూరు ప్రజా ప్రతినిధుల కోర్టు మంగళవారం సమన్లు జారీ చేసింది. జూలై 28న స్వయంగా కోర్టుకు హాజరు కావాలని సూచించింది. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిబంధనలు ఉల్లంఘించి కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేసిన మేరకు కోర్టు స్పందించింది. కంట్రాక్టర్ సంతోష్ పాటిల్ మృతి నేపథ్యంలో మంత్రి ఈశ్వరప్పను కేబినెట్ నుంచి తొలగించాలని కాంగ్రెస్ నేతలు, అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై నివాసం ఎదుట ఆందోళన చేశారు. హై గ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో 36మందిపై కేసులు న మోదై ఉండేవి. సీఎం, డీసీఎంలతోపాటు రాష్ట్ర పార్టీ వ్య వహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాకు సమన్లు జారీ అయ్యాయి.

# బీఆర్ఎస్ నేతల ఇళ్లలో కలకలం రేపుతున్న ఐటీ సోదాలు

హైదరాబాద్ జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) : తెలంగాణలో బీఆర్ఎస్ నేతల ఇళ్లలో ఐటీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఈరోజు ఉదయం నుంచి బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేల ఇళ్లు, కంపెనీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఐటీ అధికారులు సోదాలు చేయడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పార్టీ నేతల ఇళ్లలో వరుసగా.. పైగా ఒకే రోజు ఏకకాలంలో ఐటీ అధికారులు సోదాలు చేయడంతో బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన మొదలైంది. ముందుగా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి నివాసాలపై ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచే సోదాలు జరుగుతున్నాయి. కొండాపూర్‌లోని లుంబిని ఎస్ఎల్ఎన్ స్ప్రింగ్స్ విల్లాస్‌లో ఎంపీ ఉండే ఇంటితో పాటు కార్యాలయాలపైన ఇన్కమ్ టాక్స్ అధికారులు సోదాలు జరుపుతున్నారు. సెంట్రల్ ఫోర్స్ బందోబస్తు మధ్య ఈ సోదల ప్రక్రియ కొనసాగుతోంది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

అలాగే యాదాద్రి జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యే నివాసం లోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. భువనగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నివాసం, కంపెనీల్లో ఈరోజు ఉదయం నుంచి ఏకకాలంలో ఐటీ సోదాలు చేపట్టింది. భువనగిరి, హైదరాబాద్ కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలనీలోని కార్యాలయాల్లో మొత్తం 12 చోట్ల ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. హిల్ ల్యాండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లలో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. హిల్ ల్యాండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీలకు పైళ్ల శేఖర్ రెడ్డి భార్య వనిత డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి కొత్తపేటలో ఉన్నారు. అటు ఎంపీ, ఇటు ఎమ్మెల్యే నివాసాల్లో ఏకకాలంలో ఐటీ సోదాలు చేయడంతో బీఆర్ఎస్ పార్టీలో టెన్షన్ నెలకొంది. ఎమ్మెల్యే నివాసంలో ఐటీ అధికారులు సుమారు 30 బృందాలతో ఈ సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆదాయపన్ను చెల్లింపు వివరాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. పైళ్ల శేఖర్ రెడ్డి ఇంట్లో కీలక డాక్యుమెంట్లను ఐటీ సీజ్ చేసింది. రెండు కంపెనీలకు చెందిన డాక్యుమెంట్లు, ఆస్తుల పాత్రలను ఐటీ సీజ్ చేసింది. రెండు వాహనాల్లో రాజశేఖర్ రెడ్డి ఇంటి నుంచి ఐటీ అధికారులు మరో చోటకు వెళ్లినట్లు తెలుస్తోంది.

ఇటు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డికి చెందిన షాపింగ్ మాల్‌పై కూడా ఐటీ శాఖ దాడులు నిర్వహించింది. కేపీహెచ్‌బీ కాలనీలోని జేసీ బ్రదర్స్‌లో ఐటీశాఖ తనిఖీలు చేపట్టింది. ఈరోజు ఉదయం 6 గంటల నుండి సోదాలు కొనసాగుతున్నాయి. జేసీ బ్రదర్స్‌కు సంబంధించి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, అతని బంధువులు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. జేసీ బ్రదర్స్‌లో జరిగిన లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

ఏకకాలంలో ఐటీ తనిఖీలపై ఆసక్తికర చర్చ..

అయితే కేంద్రమంత్రి, బీజేపీ నేత అమిత్ షా తెలంగాణ పర్యటన వేళ ఐటీ సోదాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా ఈ సోదాలు జరగడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. మును ముందు మరికొంతమంది అధికార పార్టీ నేతల ఇళ్లలోనూ సోదాలు జరిగే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఐటీ తనిఖీలు జరగడం, అది కూడా అధికార బీఆర్ఎస్‌లో ఆర్థికంగా బలంగా ఉన్న నేతలే టార్గెట్‌గా సాగుతుండటంతో బీఆర్ఎస్‌లో కలవరపాటు మొదలైంది.

# రాజ్ భవన్‌లో రెడ్ క్రాస్, ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాన దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖా వారి ఆధ్వర్యంలో వరల్డ్ బ్లడ్ డొనర్ డే వేడుకలు ను రాజ్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎక్కువ బ్లడ్ డొనేషన్ చేసిన విభాగం లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ కు చెందిన ఎ. వి రావు, యోగెష్ శ్రీవాత్సవ లకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డా. తమిళ సై సౌందర్య రాజన్ చేతుల మీదుగా వరల్డ్ బ్లడ్ డొనర్ డె మెమొంటొ మరియు సర్టిఫికేట్ లను ప్రదానం చేశారు. ఈ అవార్డు మరియు సర్టిఫికేట్ రావడానికి కారకులైన రెడ్ క్రాస్, హైదరాబాద్ జిల్లా శాఖా చైర్మన్ మామిడి భీమ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకల్లో స్టేట్ టిబి కన్వీనర్ డా. విజయ్ భాస్కర్ గౌడ్, యం సి సభ్యులు రియాజుద్దీన్, ప్రవీణ్ కుమార్, మహేంద్ర రెడ్డి, కల్పన దత్త,వెంకట్, లీలావతీ, తదితరులు పాల్గొన్నారు

# ఎన్టీఆర్ భవన్‌కు జేసీ దివాకర్‌రెడ్డి సన్మానించిన టీటీడీపీ నేతలు

హైదరాబాద్ జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, అనంతపూర్ మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ కు వచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ పార్టీ నాయకులు పలువురు ఆయన్ని కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తాజా రాజకీయాలపై కాసేపు జేసీతో చర్చించారు. రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చిన జేసీ దివాకర్‌రెడ్డిని టీటీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఏ ఎస్ రావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మండూరి సాంభశివరావు, రాజకీయ విశ్లేషకులు చల్లా శ్రీనివాస్ రావు, పలువురు మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# జౌర్..తీన్ దిన్.. తెలంగాణలో దంచికొడుతున్న ఎండలు

హైదరాబాద్ జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. రాగల మూడు రోజులు ఎండలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంటూ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది.అదే సమయంలో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ వడగాలు వీస్తాయని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచి ర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో.. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నల్గొం డ, జిల్లాలతో పాటు జగిత్యాల, పెద్ద పల్లి, ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# మహిళలు రక్త దానం..ప్రాముఖ్యత

**-లిల్లీ మేరి , అసిస్టెంట్ ప్రొఫెసర్& ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సిద్దిపేట.**



హైదరాబాద్ జూన్ 15(ఎక్స్ ప్రెస్ న్యూస్ )అత్యవసర పరిస్థితుల్లో మరొకరి ప్రాణం పోసేది రక్తదానం. దీనిని కృత్రిమంగా ఉత్పత్తి చేయడం సాధ్యపడదు. రక్తదానం ఒక పవిత్ర కార్యని. పోయిన ప్రాణాలను మనము ఎలాగో తీసుకురాలేము. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడే ప్రాణాలను ఒక్కోసారి సాటి మనిషి రక్తముతో కాపాడగల ము. ఇది రక్త దానము తోనే సాధ్యం. రక్తదానం విషయంలో స్త్రీ పురుషుల అన్న తేడా లేదు. ఇద్దరూ రక్తదానానికి అర్హులే. అయితే కారణాలు ఏమైతేనేం రక్తదానం విషయంలో ఒక్క మన దేశంలోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా కూడా స్త్రీలు కొంతవరకు ముందుకు రావటం లేదు. ప్రపంచంలో జరుగుతున్న మొత్తం రక్తదానం లో ప్రస్తుతం పురుషుల వాటా దాదాపు 70 శాతం గా ఉంది. మన దేశంలో కూడా స్త్రీలు ఆశించిన స్థాయిలో ముందుకు వచ్చి రక్తదాన ఉద్యమంలో పాల్గొనడం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ జూన్ 2021 లో ప్రకటించిన గణాంకాల ఆధారంగా మన దేశంలో రక్త దానము పురుషుల ద్వారా 70 శాతం, స్త్రీల ద్వారా 30 శాతం జరుగుతుంది. అంటే స్త్రీలు రక్తదానం లో చాలా తక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, యువత ముందుకు వచ్చి రక్తదానం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మెరుగైన ఫలితాలను చూస్తున్నాము. ఈ పరిస్థితి ఇలా ఉంటే ప్రపంచంలోని దాదాపు 13 దేశాలలో స్త్రీలు చేసిన రక్తదానం, పురుషుల రక్తదాన స్థాయిని మించి పోయింది. ఉదాహరణకు స్త్రీల రక్తదానం జింబాబ్వేలో 54.9 శాతముగా, ఖ్వజూబీఎశ్రీతిఇ 51.6 శాతముగా, ఖ్వజూబీఎశ్రీతిఇ మోల్డోవా లో 71%, జార్జియాలో 57.2% న్యూజిలాండ్ లో 51.6% గా, అమెరికాలో 50.1% గా ఎస్టోనియాలో 50.2%, అజర్బైజాన్ లో 59.8% గా ఉంది. ఈ దేశాలలో రక్తదానం విషయంలో స్త్రీలు చూపిస్తున్న చొరవ, ఉత్సాహాన్ని ప్రపంచంలోని పలు దేశాలు ఆదర్శంగా తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా మనదేశంలో ఈ విషయంలో ఉన్న అపోహలను తొలగించడం ద్వారానే ఫలితాలు లభిస్తాయి అని చెప్పాలి.మన దేశములో రక్తదాన ఉద్యమంలో మహిళలు ఆశించిన స్థాయిలో పాల్గొనకపోవడనికి ఒక కారణం రక్తహీనత. మన దేశంలోని అనేక సామాజిక వర్గాలలోని స్త్రీలు రక్తహీనత అనే సమస్యను ఎదుర్కొంటున్నారు.

దీనికి కొంత వరకు కుటుంబ పరంగా వస్తున్న సాంప్రదాయాలు కూడా ఒక కారణంగా చెప్పాలి. పుట్టినరోజులు, పెళ్లిరోజులు చేసుకుంటూ బంధుమిత్రులకు విందు ఇవ్వడం కంటే ఇలాంటి రోజులలో రక్తదానం చేయడం గొప్ప సంతృప్తినిస్తుంది. అయితే దురదృష్టవశాత్తు రక్తదానంపై ప్రజలలో ఇంకా సరైన అవగాహన లేదు. ఎన్నో అపోహలు వెంటాడుతున్నాయి. ఎలాగంటే, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబంలోని సభ్యులందరూ భోజనం చేసిన తర్వాతే స్త్రీలు ఆ మిగిలిన అడుగుబొడుగు ఆహారాన్ని తీసుకోవటం మనం గమనిస్తాం. అలాగే పిల్లల విషయంలో కూడా అబ్బాయిలకు ఇచ్చినంత ప్రాధాన్యం అమ్మాయిలకు ఇవ్వకపోవటం నేటికీ కొన్ని వర్గాలలో కొనసాగుతూ ఉన్నది. ఈ సమస్యల వల్ల కూడా సరైన పోషకాహారం స్త్రీలకు అందకపోవటం వల్ల రక్తహీనత అనే సమస్య కలుగుతున్నది.స్త్రీలలో ప్రకృతికి సంబంధించిన మరో అంశం కూడా రక్తహీనతకు దారి తీస్తున్నది. స్త్రీల నెలసరి లో రక్తం కోల్పోవడం కూడా రక్తహీనతకు దారి తీస్తున్నది. అలాగే ప్రసవ సమయంలో స్త్రీలు దాదాపు 700 మిల్లీ లీటర్ల వరకు రక్తాన్ని కోల్పోతున్నట్లు నిపుణులు తున్నారు.ఇలాంటి కారణాలు ఉన్నప్పటికీ పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానంగా రక్తదాన ఉద్యమంలో పాల్గొనటానికి అవకాశం ఉన్నట్లు ప్రపంచంలోని అనేక దేశాలు రుజువు చేస్తున్నాయి.కావలసిందల్లా రక్తదానంపై ప్రజల్లో అవగాహన కలగడంతో పాటు, ఆహారం తీసుకునే విషయంలో కూడా స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే అనే భావన సమాజంలో ఏర్పడాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం కొంతవరకూ సానుకూల మార్పులు వచ్చాయి. ఇది గ్రామీణ ప్రాంతాలలోని సమాజాలకు కూడా విస్తరించినట్లు అయితే ఫలితాలు మరింత ఆశాజనకంగా ఉంటాయి. ఆరోగ్యవంతులైన వ్యక్తులు ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం నిరభ్యంతరంగా చేయవచ్చు. స్త్రీలు కనీసం సంవత్సరానికి ఒకసారైనా రక్తదానం చేయడానికి ముందుకు వస్తే మరో ప్రాణాన్ని బతికించిన వారవుతారు.

# ఎన్‌జీటీ ఉత్తర్వులు, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి : గండ్ర సత్యనారాయణ రావు



వరంగల్, జూన్ 15:జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావ్ పల్లి(బి), కాల్వపల్లి వాగుల నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, ఎన్‌జీటీ ఉత్తర్వులు, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణ రావు డిమాండ్ చేశారు. గురువారం టేకుమట్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ కోటగిరి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జిటి) ఆదేశాలను జిల్లా కలెక్టర్ అమలు పరచాలని కోరుతూ కాంగ్రెస్ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. ఈ రాస్తారోకో లో పాల్గొన్న గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికార యంత్రాంగం అండదండలతో ఇసుక మాఫియా దందా జోరుగా సాగుతోందని విమర్శించారు.

## వెంటనే ఇసుక క్వారీలు నిలిపివేయాలి

టేకుమట్ల మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఇళ్లు నిర్మించుకునేందుకు ఒకటి, రెండు ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇవ్వని ప్రభుత్వ అధికారులు, నిత్యం వందలాది లారీలల్లో మాత్రం ఇసుక తీసుకుపోవడానికి అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాలో డీసిల్టేషన్ పేరుతో నడుస్తున్న అక్రమ ఇసుక క్వారీలను రద్దు చేయవలసిందిగా జాతీయ హరిత ట్రిబ్యునల్ 31మే రోజున మధ్యంతర ఉత్తర్వుల ద్వారా జిల్లా కలెక్టర్ ను ఆదేశించినప్పటికీ అక్రమ ఇసుక రవాణాను నిరోధించడానికి అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టనందున స్థానిక రైతాంగం ఇసుక లారీలను నిలిపివేసి తమ నిరసనను ప్రకటించారన్నారు. చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ లో దాఖలైన పిటిషన్ సంఖ్య 68/2023 లో 31 మే రోజున మధ్యంతర ఉత్తర్వులనిస్తూ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ డీసిల్టేషన్ పేరుతో మానేరు , గోదావరి నదులలో (14) చోట్ల ఇసుక రీచ్ ల ఏర్పాటుకు అనుమతించిన ప్రొసీడింగ్స్ రద్దు చేసిందని తెలిపారు. ఇసుక క్వారీలను వెంటనే నిలిపి వేయుటకు జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని, లేనియెడల అతనిపై సైతం వ్యక్తిగతంగా చర్యలు తీసుకోబడునని ఎన్జీటీ హెచ్చరించినప్పటికీ ఇసుక మాఫియా ప్రలోభాలకు లోనైన జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని జీఎస్సార్ ఫైర్ అయ్యారు.

తాము ఎన్జిటి ఉత్తర్వుల కాపీతో సహా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన కరువైనందునే అనివార్యంగా ఇసుక లారీల నిలిపివేతకు పూనుకున్నామని తెలిపారు. ఇప్పటికైనా న్యాయస్థానం ఉత్తర్వులను గౌరవిస్తూ, రైతుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తున్న ఇసుక త్రవ్వకాలను నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వైనాల రవీందర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండ శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షుడు మాదం కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శులు దాసారపు సదానందం, పొన్నం సాంబయ్య, గోనపల్లి సంపత్, శాస్త్రాల కిరణ్, తోడేటి కుమార్, మంద నరేందర్, బొల్లికొండ చిన్న రాజయ్య, అచ్చ స్వామి, అనవేణి మొగిలి శాస్త్రాల సుధాకర్ అల్లం ఓదెలు, పంజాల రవి, గోనే శ్రీనివాసరావు, చిట్యాల శ్రీనివాస్, రెడ్డి రాజుల రాజు, మచ్చ ప్రభాకర్, నునేటి రమేష్, వేముల మనోహర్, నానవేన రాజు, పండుగ అనిల్, సతీష్, ఉడత రమేష్, పండుగ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వైఎస్ జగన్‌తో బీసీ సంఘాల భేటీ

**-ఆగస్టు ఏడో తేదీన తిరుపతిలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు ఆహ్వానించిన నేతలు**



అమరావతి జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తో ఈరోజు విజయవాడలోని తాడేపల్లి లో ఉన్న సీఎం క్యాంప్ కార్యాలయంలో అఖిలభారత బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు, పూర్వ జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్ రావుల నేతృత్వంలో బీసీ ప్రతినిధుల బృందం భేటీ జరిగింది ఈ సందర్భంగా సీఎం జగన్ బీసీ సంఘాల నేతలతో అరగంట సేపు చర్చించారు. ఈ సందర్భంగా ఆగస్టు ఏడవ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి పట్టణంలోని ఎస్వీయూ స్టేడియంలో జరిగేటువంటి జాతీయ ఓబీసీ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఈ సందర్భంగా సిఎంకు అహ్వాన పత్రికను అందజేశారు అనంతరం వైయస్ జగన్ బీసీల సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్నటువంటి కృషిని అభినందిస్తూ వారిని శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఈ సందర్భంగా బీసీ నేతలు సత్కరించారు. అనంతరం జాతీయ బిసి కమిషన్ మాజి చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు, రాష్ట్రీయ ఓబీసీ మహాసంగ్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ భవన్ రావు తైవాడే సిఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియా తోమాట్లాడుతూ బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వాటా దక్కాలని చాలా సంవత్సరాలుగా పోరాడుతునా మని, ఇప్పుడు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీల ఆకాంక్షలకు అనుగుణంగా, బీసీలకు సముచిత స్థానం కల్పించి, జనాభా దామాషా ప్రకారం రాష్ట్ర మంత్రివర్గంలో, రాజ్యసభ పదవులు, ఎమ్మెల్సీ తదితర నామినేటెడ్ పోస్టులలో బీసీలకు ఇవ్వడం శుభ పరిణామం అన్నారు .ఇదే విధంగా బీసీ విద్యార్థులకు 100% ఫీజుల రియంబర్స్మెంట్ ఇవ్వడమే కాకుండా బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం వారు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో ప్రైవేటు బిల్లు పెట్టిన ఘనత వారికే దక్కుతుందని వారు అన్నారు.ఇదే సమయంలో బీసీ కులగణన చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఎంతో చారిత్రాత్మకమైనదని వారు కొనియాడారు. బీసీల సమగ్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నటువంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ను జాతీయ ఓబీసీ మహాసభకు ముఖ్యఅతిథిగా పిలవాలని నిర్ణయించడం జరిగిందని,ఇందుకు బీసీల ఆహ్వానాన్ని మన్నించి సిఎం హాజరు అవుతానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మహాసభకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి,అలాగే కాకుండా,ముఖ్యంగా,ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి వేలాది మంది బీసీ ప్రతినిధులు, ఉద్యోగులు, మహిళలు, యువకులు, విద్యార్థులు, కుల సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ ను కలిసిన వారిలో బీసీ సంఘాల నేతలు ఆల్ మెన్ రాజు, కుమ్మర క్రాంతి కుమార్, కుల్కచర్ల శ్రీనివాస్, కనకాల శ్యాం కురుమ, తాటికొండ విక్రమ్ గౌడ్, నాగమల్లేశ్వరరావు, నాగరాజు, బిసి రమేష్ గౌడ్, జగదీష్, సచిన్ రాజోలుకర్ తదితరులు ఉన్నారు.

# కారు బోల్తా.. ధ్వంస.. ప్రాణాలతో బయటపడ్డ వైనం

రంగారెడ్డి జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అతివేగంతో దూసుకొచ్చిన కారు బోల్తా పడినప్పటికీ అందులో ప్రయాణిస్తున్న వారు మాత్రం క్షేమంతో బయటపడ్డారు.

కారు బోల్తా కొట్టిన విధానం.. కారు ధ్వంసమైన విధానం చూస్తే కచ్చితంగా ప్రాణాలతో ఉండరని అంతా అనుకుంటారుపెను ప్రమాదాలు జరిగిన చోట కొన్ని అద్భుతాలు కూడా జరుగుతుంటాయి. ప్రమాదం ఎలా, ఎటువైపు నుంచి వస్తుందో ఎవరికీ తెలియదు. కొన్ని కొన్ని సార్లు పెద్ద ప్రమాదం నుంచి స్వల్పగాయాలతో బయటపడగా.. మరికొన్ని సార్లు చిన్న ప్రమాదంలో కూడా ప్రాణాలు కోల్పోయిన వారు చాలా మందే ఉన్నారు. ఇప్పుడు తాజాగా అయితే అదృష్టవశాత్తు ఆ ఇద్దరు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డైరీ ఫార్మ్ పిల్లర్ నెంబర్ 215 వద్ద ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. మెహదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు వస్తున్న కారు పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణికుస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు హైవేపై అడ్డంగా పడిపోవడంతో భారీగా ట్రాఫిక్ జాం అయింది. సమాచారం అందిన వెంటనే రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసే పనిలో పడ్డారు. అయితే అతివేగం కారణంగానే కారు డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు అంచనా వేస్తున్నారు.

# ఘోర ప్రమాదం... నలుగురు చిన్నారుల మృతి

భద్రాద్రి జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జిల్లాలో బూర్గంపాడ్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. బ్రిడ్జిపై నుంచి టాటాఏస్ వాహనం కిన్నెరసాని వాగులో పడిన ప్రమాదం లో నలుగురు చిన్నారులు మృతి చెందగా.. పలువురికి తీవ్రగాయా లయ్యాయి. ప్రమాద సమయంలో టాటా ఏస్ లో 20 మంది ప్రయాణికు లు ఉన్నారు. బాధితులు టి.నర్సాపురం లోని తిరుమలదేవిపేట వాసులుగా గుర్తించారు. భద్రాచలం దర్శనానికి వెళ్లివస్తుండగా ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమాచారం అందు కున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు అడిగితెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# మహిళలకు అందరికి ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం - రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 15: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన ఎంపీ కార్యాలయంలో కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో ఆదిలాబాద్, షాద్‌నగర్, ఉప్పల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇల్లు కట్టుకునే పేదలకు 5లక్షల సాయంతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

అదే విధంగా రైతులకు 2లక్షల రుణమాఫీ, 500రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డల కష్టాలు తీరుస్తామని వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పిస్తామన్నారు.

అదిలాబాద్ రాజకీయాల గురించి మాట్లాడుతూ, జోగు రామన్నను జోకుడు రామన్న అంటే బాగుంటదన్నారు. జోగు రామన్న చెల్లని రూపాయని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్న రేవంత్? అందుకే ఆయనకు మళ్లీ మంత్రి పదవి ఇవ్వవలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని ఆయన ధ్వజమెత్తారు. మరోసారి సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ కాపీ కొట్టే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నఆయన ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తామని పునరుద్ఘాటించారు.

# సినిమాలపైనే నా దృష్టి.. కేసీఆర్ అంటే అభిమానం.. సుమన్

అమరావతి, జూన్ 15:ప్రస్తుతానికి రాజకీయాల గురించి సీరియస్‌గా ఆలోచించడం లేదని చెప్పారు సీనియర్ నటుడు సుమన్. నేడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు సుమన్. అనంతరం ఆలయం బయట ఆయన మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్.. బీఆర్ఎస్ పార్టీ అయ్యింది. ఒకవేళ బీఆర్ఎస్ పార్టీ ఐఆర్ఎస్ అయినా ఆతను మద్దతు ఇస్తానని చెప్పారు సుమన్. సీఎం కేసీఆర్ మీద నాకు అంత అభిమానం ఉంది అని చెప్పారు. తన దృష్టి సినిమాలపైనే అని చెప్పారు. తిరుమల వెళ్లి దండం పెట్టడం తప్ప వెంకటేశ్వరస్వామి మీద నాకు అంత భక్తి ఉండేది కాదు. పెద్దగా కేర్ చేసేవాడిని కాదు. అయితే అన్నమయ్య సినిమాలో ఏడుకొండల వాడి పాత్ర చేసిన తర్వాత నా మీద వెంకన్నకు అంత ప్రేమ, ఇష్టం ఉన్నాయని తెలిసింది. అందుకే ఆయన పాత్రను నేను పోషించే అవకాశం కల్పించారని తెలుసుకున్నానన్నారు. తిరుపతిలో ఉన్న తన అభిమాని నారాయణ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నట్లు చెప్పారు.

# తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా బండి సంజయ్ కొనసాగింపు

## - తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్

న్యూఢిల్లీ జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని మార్చేది లేదని బీజేపీ జాతీయ నాయకత్వం స్పష్టత ఇచ్చినట్టు తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ తెలిపారు. ఈ నెల 25న బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తెలంగాణలో పర్యటించనున్నారని తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ తెలిపారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్‌లో జరిగే భారీ బహిరంగ సభలో నడ్డా పాల్గొననున్నారని తెలిపింది. అతి త్వరలో అమిత్ షా పర్యటన కూడా ఖరారు కానుందని వెల్లడించారు. వాయిదా పడిన పర్యటనను ఖమ్మంలోనే కొనసాగించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. నేతలంతా సమిష్టిగా కలిసి ఎన్నికల సమరంలో ఉంటారని తరుణ్ చుగ్ పేర్కొన్నారు. పార్టీలో ముఖ్య నేతలు అందరికి కీలకమైన బాధ్యతలు ఉంటాయన్నారు. రాష్ట్ర నాయకత్వం సమిష్టిగానే పనిచేస్తుందని తరుణ్ చుగ్ వెల్లడించారు. బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేక సామాజిక మాధ్యమాల్లో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయన్నడం అభూత కల్పనగా కొట్టిపడేశారు. నితీష్ నేతృత్వంలో విపక్షాల భేటీకి కాంగ్రెస్‌తో పాటు తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా హాజరవుతున్నారన్నారు. దీనికి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఏం సమాధానం చెబుతారన్నారు. పై స్థాయిలో అంతా కలిసి పని చేస్తారని.. రాష్ట్రానికి వచ్చేసరికి విమర్శలు చేసుకుంటారన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్‌ల సంస్కృతి ఇదేనన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు బీ టీంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. కొన్ని సందర్భాల్లో బీ టీంగా, కొన్నిసార్లు సి టీంలో కూడా కాంగ్రెస్ పార్టీనే పోటీ పడుతోందని తరుణ్ చుగ్ అన్నారు.

# డబ్బు కోసమే ఎంపి కుటుంబ సభ్యులు కిడ్నాప్ - విశాఖ పోలీస్ కమిషనర్



అమరావతి, జూన్ 15: వైసిపి విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య జ్యోతి, కుమారుడు శరత్ చంద్ర, వారి ఆడిటర్ గన్నవనేని వెంకటేశ్వరరావు (జీవీ) కిడ్నాప్ డబ్బుకోసం జరిగిదంటూ వైజాగ్ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ తెలిపారు.. కిడ్నాప్ పై ఎంపి నుంచి ఫిర్యాదు వచ్చిన రెండు గంటలలోనే సెల్ ఫోన్ సిగ్నల్ ద్వారా కిడ్నాపర్స్ ను పట్టుకుని, ఎంపి కుటుంబ సభ్యులను పోలీసులు విడిపించారు..

ఈ కేసు వివరాలను విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ మీడియా కు వివరిస్తూ, . విశాఖ ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ కు సిరాస్తి వ్యవహారం కారణం కాదని తెలిపారు. డబ్బు కోసమే ఎంపీ భార్య, కుమారుడ్ని, వారి ఆడిటర్ ను కిడ్నాప్ చేశారని స్పష్టం చేశారు. ఈ నెల 13న ఎంపీ కుమారుడు శరత్ చంద్రను కిడ్నాప్ చేశారని, ఆపై శరత్ తల్లిని కూడా బెదిరించి బంగారం, నగదు తీసుకున్నారని వెల్లడించారు. ఆడిటర్ వద్ద ఎక్కువ డబ్బు ఉంటుందని ఆయనను కూడా పిలిపించారని తెలిపారు. జీవీ, శరత్ చంద్ర ఖాతాల నుంచి రూ.కోటిన్నరకి పైగా లావాదేవీ జరిగిందని సీపీ పేర్కొన్నారు.

ఎంపీ భార్య, కుమారుడు, ఆడిటర్ ను వారి కారులోనే ఎక్కించుకుని ఇంటి నుంచి బయటికి తీసుకువచ్చారని వెల్లడించారు. అయితే, తన ఆడిటర్ ఫోన్ స్పందించడంలేదని ఎంపీ చేసిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగినట్టు సీపీ త్రివిక్రమ వర్మ వివరించారు. టెక్నాలజీ సాయంతో కిడ్నాపర్లను పట్టుకున్నామని చెప్పారు. ఈ ఘటనలో ఏడుగురి ప్రమేయం ఉన్నట్టు ప్రాథమికంగా తేలిందని, ఇప్పటివరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారితో ఒకరు రౌడీ షీటర్ హేమంత్ కుమార్ గా గుర్తించామన్నారు..

“ఎంపీ సత్యనారాయణ నేటి ఉదయం 8 గంటలకు ఫోన్ చేసి వారి ఆడిటర్ జీవీ కిడ్నాప్ అయినట్టు అనుమానంగా ఉందని చెప్పారు. ఎంపీ నివాసంలో సీసీ కెమెరాలు లేవు. వెంటనే పోలీసు బృందాలు అప్రమత్తం అయ్యాయి. ఆడిటర్ జీవీకి ఫోన్ చేస్తే ఆయన లైన్ లోకి వచ్చారు,నాకేమీ కాలేదు, శ్రీకాకుళం నుంచి వస్తున్నాను అని చెప్పారు. కానీ టెక్నికల్ ఎవిడెన్సులు చూస్తే, ఆడిటర్ జీవీ ఏదో పొంతన లేకుండా మాట్లాడినట్టు అర్థమైంది. సెల్ ఫోన్ సిగ్నల్ రుషికొండ ఏరియాను చూపిస్తోంది. వారు విజయనగరం వైపు పారిపోయే అవకాశం ఉన్నట్టు గుర్తించాం. దాంతో పోలీసులు వారి వాహనాన్ని చేజ్ చేశారు. చివరికి కిడ్నాపర్లు ఉన్న కారు సీఐ వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కనే ఉన్న తుప్పల్లోకి వెళ్లిపోయింది. దాంతో హేమంత్, రాజేశ్ అనే ఇద్దరు వ్యక్తులు కారు దిగి పరిగెత్తారు. వాళ్లిద్దరినీ పోలీసులు వెంటాడి పట్టుకున్నారు.

కిడ్నాపర్లలో ఒకరు గతంలో ఎంపీకి చెందిన కంపెనీలో సబ్ కాంట్రాక్టరుగా పనిచేశారు. ఎంపీ వద్ద బాగా డబ్బు ఉంటుందని భావించి ఈ కిడ్నాప్ కు ప్రయత్నించారు. డబ్బు కోసమే ఈ కిడ్నాప్ చేశారు. కిడ్నాపర్లలో హేమంత్ అనే వ్యక్తిపై హత్య, పలు కిడ్నాప్ లు సహా 12 కేసులు ఉన్నాయి. హేమంత్ స్వస్థలం భీమిలి” అని సీపీ తివిక్రమ వర్మ వివరించారు. ఈ కేసును ఛేధించడంలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులను ఆయన అభినందించారు..

# ఆహార ద్రవ్యోల్బణాన్ని నిరోధించేందుకు ఆయిల్ దిగుమతులపై సుంకాల తగ్గింపు

న్యూఢిల్లీ జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బుధవారం అర్ధరాత్రి సంచలన నిర్ణయం తీసుకుంది. ఆహార ద్రవ్యోల్బణాన్ని నిరోధించేందుకు రిఫైన్డ్ సోయాబీన్ ఆయిల్, రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులపై సుంకాలను తగ్గించింది. ఈ రెండు నూనెలపైనా దిగుమతి సుంకాన్ని 17.5 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గించింది. దీంతో వినియోగదారులకు కూడా ధరలు తగ్గే అవకాశం ఉంది.అయితే ట్రేడర్ల స్పందన వేరే విధంగా ఉంది. ప్రభుత్వం కేవలం సెంటిమెంట్ కోసమే ఈ చర్య తీసుకుందని, క్షేత్ర స్థాయిలో దీని ప్రభావం పెద్దగా ఉండదని చెప్తున్నారు. మన దేశం రిఫైన్డ్ సోయాబీన్, రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌లను అరుదుగా దిగుమతి చేసుకుంటుందని చెప్తున్నారు. వీటిని ముడి రూపంలోనే దిగుమతి చేసుకుని, భారత దేశంలోనే రిఫైన్ చేస్తారని చెప్తున్నారు. క్రూడ్ సోయాబీన్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, పామాయిల్‌లపై దిగుమతి సుంకం దాదాపు 5.50 శాతం.దేశీయంగా, అంతర్జాతీయంగా కొద్ది నెలలుగా వంట నూనెల ధరలు తగ్గిపోయాయని, సుంకాలను పెంచాలని మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి. కానీ ప్రభుత్వం ఈ సుంకాలను తగ్గించింది. ఎన్నికల ఏడాది కావడంతో ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ట్రేడర్లు అంటున్నారు. ఎల్‌నినో సంవత్సరం కావడంతో 2023లో నైరుతి రుతుపవనాలపై ఆందోళన ఉందని అంటున్నారు. వంట నూనెల ధరలు అదుపులో ఉండాలని ప్రభుత్వం కోరుకుంటోందని చెప్తున్నారు. సుంకాల తగ్గింపు వల్ల తాత్కాలికంగా సెంటిమెంటల్ ప్రభావం ఉండవచ్చునని చెప్తున్నారు. 2023 జూన్ 2నాటి సమాచారం ప్రకారం దిగుమతి చేసుకున్న క్రూడ్ పామాయిల్ ధర భారత దేశంలో టన్నుకు దాదాపు 860 డాలర్లు. ఇది గత ఏడాది కన్నా 45 శాతం తక్కువ. దిగుమతి చేసుకున్న క్రూడ్ సోయాబీన్ టన్ను ధర 970 డాలర్లు. ఇది గత ఏడాది కన్నా 43 శాతం తక్కువ. దిగుమతి చేసుకున్న క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర టన్నుకు 860 డాలర్లు. ఇది గత ఏడాది కన్నా 55 శాతం తక్కువ. 2023 ఏప్రిల్‌లో మన దేశం 1.05 మిలియన్ టన్నుల వంట నూనెలను దిగుమతి చేసుకుంది. ఇది గత ఏడాది ఇదే కాలంలో దిగుమతి చేసుకున్నదాని కన్నా 15 శాతం ఎక్కువ.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది

మెదక్, జూన్ 15:(నేటినిజం ప్రతినిధి):జిల్లాలో రబీ సీజనుకు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3,51,990 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయగా 68,024 మంది రైతుల నుండి 64 కోట్ల 37 లక్షల విలువగల 3. 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ధాన్యమంతా మిల్లులకు తరలించామన్నారు. కాగా 28,757 మంది రైతులకు చెందిన 1. 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 231 కోట్ల 43 లక్షలు వారి ఖాతాలో జమచేశామన్నారు. 86 శాతం టాబ్ ఎంట్రీ కూడా పూర్తయ్యిందని, త్వరలో మిగతా రైతులకు కూడా వారి ఖాతాలో డబ్బులు జమచేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లతో పాటు మే నెలాఖరుకు సి.ఎం.ఆర్. రైస్ తరలించుట కు గడవు ఉన్నందున, అకాల వర్షాల వల్ల కాస్త ఇబ్బంది వడ్డా ప్రజాప్రతినిధులు, అధికారులు , పోలీసుల సహకారంతో 45 రోజులల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. గోదాముల స్థలాభావం కొరత దృష్ట్యా రంగారెడ్డి, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించడంతో పాటు నర్సాపూర్ లో మూత పడ్డ అల్యూమినియం ఫ్యాక్టరీ, ఖండసారి షుగర్ ఫ్యాక్టరీ, కూచారం లో ప్రైవేట్ గోదాం ఇలా జిల్లాలో అవసరమైన ప్రాంతాలలో ప్రైవేట్ గోదాములు తీసుకొని ధాన్యం నిలువ చేశామన్నారు. మంత్రుల దిశా నిర్దేశం, మార్గదర్శనకం మేరకు కొనుగోళ్ళ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం, అధికారులు, రెవెన్యూ, పోలీసు తదితర అందరి సహకారంతో రైతుల నుండి పూర్తిగా ధాన్యం కొనుగోళ్లు చేసి క్స్, ఐ.కె. పి, .మార్కెటింగ్ శాఖల దారా ఏర్పాటు చేసిన అన్ని కొనుగోలు కేంద్రాలు మూసివేశామని కలెక్టర్ తెలిపారు.

# రాబోయే ఎన్నికల్లో కుప్పంలో లక్ష మెజార్టీ దిశగా పనిచేయాలి : చంద్రబాబు




అమరావతి, జూన్ 15:కుప్పంలో రెండవరోజు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటన కోలాహలంగాకొనసాగింది. ఉదయం నుండి ఇతర పార్టీల నుండి చేరికలు, తెదేపా శ్రేణులతో సమీక్షాలు, బహిరంగ సభలో పాల్గొని ప్రసంగం చేశారు. బీసీఎన్ కళ్యాణ మండపంలో చంద్రబాబు నాయుడు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు డా. సురేష్ బాబు, అతని అనుచరులు టీడీపీలో కండువా కప్పుకొన్నారు. ఇదే సభలో వైసీపీ, ఇతర పార్టీల నుండి వందలాది మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ పెట్టినప్పటి నుంచి కుప్పంలో టీడీపీ జెండా ఎగురుతూనే ఉందన్నారు. కుప్పం నియోజకవర్గం అభివృద్ధి కావాలన్నా, మన పిల్లలు భవిష్యత్ బాగుండాల అన్నా టీడీపీనే గెలవాలని ఆయన తెలిపారు. నేడు పార్టీలో చేరుతున్న వారిని మనస్ఫూర్తిగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నానని, అందరూ కలిసి వచ్చే ఎన్నికల్లో కుప్పంలో లక్ష మెజార్టీ దిశగా పనిచేయాలని తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో కుప్పం నియోజకర్గం అంటే ఒక గౌరవం ఉందన్నారు. డాక్టర్ సురేష్ బాబు తండ్రి దొరస్వామి నేను ఒకే సారి ఎమ్మెల్యేలయ్యామని తెలిపారు.

సంపద సృష్టించటం ఆ సంపదను పేదలకు పంచడం తెలిసిన పార్టీ టీడీపీ అన్నారు. రాష్టంలో రెండు రూపాయలకే కిలో బియ్యం, పక్కా ఇళ్ల నిర్మాణం, జనతా వస్త్రాలు వంటి సంక్షేమం పథకాలకు నాంది పలికిన పార్టీ టీడీపీ అన్నారు. అదే విధంగా ఐటీనీ అందిపుచ్చుకుని సంపద సృష్టించామని, వైసీపీ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నీతి నిజాయితీకి మారు పేరు కుప్పం ప్రజలు, నేడు ఇక్కడ రౌడీలు పేట్రేగిపోతున్నారు, నా దగ్గర మీ రౌడీయిజం చెల్లదని తీవ్రవాదులపై పోరాడిన పార్టీ, రౌడీలను తుదముట్టించిన పార్టీ టీడీపీ అని తెలిపారు. పేదలను ధనికుల్ని చేసే బాధ్యతను తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందని తెలిపారు. నాడు దీపం పథకం గ్యాస్ సిలిండర్ లు ఇచ్చాం, కాలేజీ సీట్లలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చి మగవారితో సమానంగా ప్రోత్సహించామని చంద్రబాబు గుర్తు చేశారు. అలాగే ఆడిబిడ్డల్ని మహాశక్తిగా రూపొందిచేందుకు మహాశక్తి పథకం తెచ్చామని, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం మని హామీలు ఇచ్చారు.

అదేవిధంగా 18 నుండి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తామని,ఇంట్లో ఎంతమంది చదువకునే పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద ఏడాదికి రూ. 15 వేల రూపాయలు ఇస్తామని తెలిపారు.యువతకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. అలాగే రైతులకు ఏడాదికి రూ. 20 వేలు అందజేస్తామని, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకొస్తామన్నారు. అలాగే కుళాయి ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తామని తెలిపారు. పేదల్ని ధనికులుగా చేస్తామని తెలిపారు. ఇక్కడ 95 శాతం పూర్తైన హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని, అదే నేనుంటే మూడేళ్లలోనే పూర్తి చేసి నీళ్లిచ్చేవాడిని తెలిపారు. అలాగే ద్రవిడ యూనివర్సిటీ ఉద్యోగులకు జీతాలివ్వలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ఉద్యోగులు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని, సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే మళ్లీ టీడీపీ గెలవాలని తెలిపారు. ఎన్నికలు మరో 9 నెలలే ఉన్నాయి, మీరంతా ప్రజల కోసం, పార్టీ కోసం పనిచేయండి, మిమ్మల్ని ఆదుకునే బాధ్యత టీడీపీ తీసుకొంటుందని తెలిపారు. గత 35 ఏళ్లలో నియెజకవర్గంలో జరిగిన అభివృద్ది వచ్చే 5 ఏళ్లలో చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఇంచార్జి మునిరత్నం, మున్సిపాలిటీ తెదేపా అధ్యక్షులు రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# భట్టి పాదయాత్ర- రాహుల్ గాంధీ ఆరా!

హైదరాబాద్, జూన్ 15:తెలంగాణ ప్రజలు ఎప్పుడూ మరిచిపోలేని దుర్దినాలు? అప్పట్లో చంద్రబాబు పాలనలో ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొత్తం అరాచక పాలన, కరువుతో అల్లాడిపోయేది. తెలంగాణ కూడా ఇందుకు మినహాయింపు కాదు. నీటిచుక్క లేక జనం అల్లాడుతూ? కన్నీటి చుక్కలతోనే? తమ దాహం తీర్చుకునేటంతటి దుస్థితి ! అదుగో అప్పుడు బయలుదేరాడు దివంగత కాంగ్రెస్ నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి! తన మనస్సుల్లాగే స్వచ్ఛమైన తెల్లటి పంచె, దానిపైన సంప్రదాయబద్ధమైన లాల్చీ, నెత్తిన రైతుల్ని తలపించే పాగా, కాళ్లకి స్పోర్ట్స్ షూసు? ఈ రూపం ఎక్కడ కనిపించినా మనకు పెద్దాయనే గుర్తుకు వస్తారు. అటువంటి సందర్భమే మరోసారి వచ్చింది తెలంగాణ నేలపై. అప్పుడు చంద్రబాబు లాగే ఇప్పుడు కేసీఆర్ అరాచక పాలన సాగుతోంది. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న తెలంగాణ ప్రజానీకానికి తొమ్మిదేళ్లుగా కన్నీళ్లే మిగిలాయి. వారి చెమర్చిన కళ్లు తుడవటానికే మనందరి జన నేత భట్టి విక్రమార్క పట్టుబట్టి బయలుదేరారు. వేయి కిలో మీటర్లు దాటి వంద రోజుల మైలురాయిని త్వరలో చేరుకోబోతున్నారు!ఆనాటి రాజశేఖర్ రెడ్డి లాగే ఇంటి నుంచీ బయలుదేరి నిర్విరావ ంంగా జనం మధ్య గడుపుతోన్న భట్టికి జూన్ 15న ఆయన బర్త్ డే సందర్భంగా ఒక స్పెషల్ కాల్ వచ్చింది! అది మరెవరి నుంచో కాదు? ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష నెరవేర్చిన సోనియమ్మ తనయుడు ఢిల్లీ నుంచీ ఫోన్ చేశారు! భట్టికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన రాహుల్ గాంధీ.. పాదయాత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. గల్లీ నుంచీ ఢిల్లీ దాకా చర్చగా మారిన పీపుల్స్ మార్చ్? రాహుల్ ను కూడా ఆకర్షించింది. జనం కోసం జననేత భట్టి విక్రమార్క చేస్తోన్న పోరాటం ఆయన చేత ఫోన్ చేయించింది.

# పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా నేడు పచ్చదనం-పరిశుభ్రతతో పరిఢవిల్లుతున్నాయి

మెదక్, జూన్ 15:(నేటినిజం ప్రతినిధి): పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా నేడు గ్రామాల స్వరూపాలే మారిపోయాయని, పచ్చదనం-పరిశుభ్రతతో పరిఢవిల్లుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం టేక్మాల్ మండలం ఏల్లంపేట్ గ్రామ పంచాయతిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రగతి దినోత్సవం కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, మండల ప్రత్యేకాధికారి జెంలా నాయక్ తో కలిసి పాల్గొన్నారు. ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి ర్యాలీగా బయలుదేరి పాఠాశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తూ సర్పంచు, ఇతర ప్రజాప్రతినిధులు గ్రామంలో ఏ ఏ కార్యక్రమాలు చేశారో తెలుసా అని వాకబు చేశారు. పల్లెలు ప్రగతికి చిహ్నాలని, పచ్చదనం పరిశుభ్రత ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తలంపుతో రాష్ట్ర ముఖ్యమంత్రి పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి గ్రామ పంచాయతీకి టంచనుగా ప్రతి నెల ఆర్థిక సంఘం నిధులు అందజేస్తుండడంతో పాటు డంప్ యార్డులు, సేగ్రి గేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వన్నెలు, తెలంగాణాకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రతి గ్రామ వంచాయతీకి ట్రాక్టర్,ట్రాలీ,దోజర్ వంటివి అందించి పల్లెలు పరిశుభ్రంగా ఉండేలా చేశారని, హరితాహారం క్రింద రోడ్డు కిరువైపుల, పబ్లిక్ సంస్థలలో విరివిగా మొక్కలు పెట్టి పచ్చదనానికి కృషిచేస్తున్నారని అన్నారు. ఒకప్పుడు పట్టణాలకు వలసలువెళ్లిన వారు నేడు పల్లెల వైపు చూస్తున్నారని ఇదంతా పల్లె ప్రగతి ద్వారా సాధ్యమైందని అన్నారు.

అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయిలు జెండా ఎగుర వేశారు. ఈ సంధర్భంగా తెలంగాణా రాక ముందు, తెలంగాణ వచ్చాక ఈ 9 ఏళ్లల్లో గ్రామంలో వివిధ పథకాల ద్వారా సాధించిన ప్రగతి, అమలు జరుగుచున్న కార్యక్రమాలు, వచ్చిన నిధులు, లబ్దిపొందిన వివరాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. నాడు-నేడు ఫ్లెక్సీ ల ఏర్పాటు ద్వారా అభివృద్ధిని స్పష్టంగా చూపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలలోని 469 గ్రామ వంచాయతీలలో వల్లె ప్రగతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామాలలో పల్లె ప్రగతి ద్వారా గుణాత్మక మార్పు తీసుకువచ్చారని అన్నారు. ప్రభుత్వం అనే సంక్షేమ వథకాలు తీసుకువచ్చిందని అన్ని కార్యక్రమాలు ఇక్కడ కూడా అమలుచున్నాయని అన్నారు. కేసిఆర్ కిట్, ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షబీముబారక్, రైతు బంధు వంటి ఎన్నో పథకాల ద్వారా గ్రామ వానులు లబ్ది పొందారని, త్వరలో ఆగిపోయిన మరికొందరికి ఆసరా పింఛన్లు అందించుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామంత్రి అందోల్ నియోజక వారం మునిపల్లి చెల్మెడ లో సంగమేశ్వర ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేశారని, తద్వారా చెరువులు నింపుకోవడం ద్వారా సాగు ఆయకట్టు పెరిగి ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని అన్నారు. 21 రోజుల పాటు వండుగలా నిర్వహిస్తున్న ఈ దశాబ్ది ఉత్సవాలు ఇప్పటి వరకు విజయవంతంగా నిర్వహింపబడ్డాయని, ఇకముందు నిర్వహించే కార్యక్రమాలలో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జెంల నాయక్,ఎంపిపి చింత స్వప్న, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 19న చలో పౌరసరఫరాలశాఖ కార్యాలయం ముట్టడి

## - రేషన్ షాపుల ద్వారా12 రకాల నిత్యావసర వస్తువులు పదికిలోల సన్న బియ్యం పంపిణీ చేయాలి

## - పివైఎల్-పిఓడబ్ల్యు రాష్ట్రకార్యదర్శులు ప్రదీప్, శిరోమణి డిమాండ్




ఖమ్మం, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి): రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసరం సరుకులు సామాన్యులు కొనలేని స్థితికి చేరాయని, ప్రభుత్వాలు రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యవసర సరుకులు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కలిసి చెరో ఐదు కేజీల చొప్పున మొత్తం 10 కిలోల సన్న బియ్యం జూన్ 19న పౌర సరఫరాల శాఖ జిల్లా కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్టు పివైఎల్,పివోడబల్యూ చేయనున్నట్లు పివైఎల్-పిఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కేవస్ ప్రదీప్,సిహెచ్ శిరోమణి లు తెలిపారు. గత పాలకులు చౌక ధరలకు నిత్యావసర సరుకులు పేదలకు అందించగా నేటి పాలకులు వాటిని రద్దుచేసి ధరలు విపరీతంగా పెంచేలా చేశారు. దీంతో రెక్కల కష్టం మీద ఆధారపడిన పేదలు దినదిన గండం నూరేళ్ల ఆయుషుల జీవనం కొనసాగించాల్సి వస్తుంది. రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యవసర వస్తువులు,10 కేజీల నాణ్యమైన సన్న బియ్యం కూడా పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు 1200 వరకు పెంచారని, దీంతో పేదలకు గ్యాస్ వాడడం ఆర్థిక భారంగా మారిందన్నారు. సగం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై పాలకుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదన్నారు. అందుకే ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని జూన్ 19న పౌర సరఫరాల శాఖ జిల్లా కార్యాలయం ముందు జరిగే ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పిఓడబ్ల్యు, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు టి.ఝాన్సీ, ఎస్వీ.రాకేష్, ఉపాధ్యక్షులు మంగతాయి, భరత్ కోశాధికారి, ప్రేమ్ సింగ్ నాయకులు ధరణి, కృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు

# చిన్నారి వైద్యం కోసం ఆర్థిక సహాయం చేసిన తెలంగాణ యువ చైతన్య ఫౌండేషన్



రాజన్న సిరిసిల్ల, జూన్ 15:(నేటనిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామానికి చెందిన సూర మహేష్ కుమారుడు రియన్ష్ పుట్టుకతోనే గుండెకి రంధ్రం ఉంది. గుండె ఆపరేషన్ చేయించడానికి ఆరోగ్యశ్రీలో చేయడానికి హాస్పిటల్ యాజమాన్యం ముందుకు రావడం జరిగింది.

బెడ్ చార్జీలు,మందులకి అయ్యే ఖర్చుల నిమిత్తం తెలంగాణ యువ చైతన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ. 11,000/ వేల రూపాయలు ఆర్థిక సహాయం రాష్ట్ర పిఆర్వో దుద్దేటి రాకేష్ చేతుల మీదుగా అందివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఎక్సిక్యూటివ్ మెంబెర్స్ వనుల అంజిబాబు,వివేక్,రిక్కి,వేణు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంపాక్ట్ ఫౌండేషన్ శిక్షణలో మొదటిస్థానం సంపాదించిన ఖమ్మం వాసి



ఖమ్మం, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి): విద్యార్థులకు వివిధ రంగాలలో స్కిల్ డెవలప్మెంట్ పై ప్రోగ్రాంలు నిర్వహించే ఇంపాక్ట్ పౌండేషన్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన భవిష్యత్తు కార్యచరణ శిక్షణ కార్యక్రమంలో ఖమ్మంజిల్లా బొనకల్ మండలం రామాపురం గ్రామానికి చెందిన షేక్ జానీమియా(నేరడ)కి ప్రథమస్థానం దక్కింది. ఈ కార్యక్రమం గత 35 రోజులపాటు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి స్పందన లభించిందని డాక్టర్. ఆదినారాయణ రెడ్డి తెలిపారు. షేక్ జానీమియా మాట్లాడుతూ...తాను ఈ శిక్షణలో ఎన్నో విషయాలు తెలుసుకోవటం నేర్చుకోవటం జరిగిందిన్నారు. తాను తెలుసుకున్న విషయాలు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తానని వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసి వారి భవిష్యత్తులో ఏమి సాధించాలి అని అనుకుంటున్నారో దానిపై అవగాహానా వెలుకువలు తెలుపుతానని షేక్ జానీమియా అన్నారు. అనంతరం డాక్టర్ ఆదినారాయణ రెడ్డి, రాములు, రాజేశ్వరి, భాస్కర్ రావు, కిషోర్ రెడ్డి, ఆధ్వర్యంలో ప్రశంస పత్రాన్ని జానీమియాకి అందజేశారు.

# కోర్టు ధిక్కరణ కేసులో ఫార్మసీ కౌన్సిల్‌పై ఏపీ హైకోర్టు ఆగ్రహం

**-వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలు**

అమరావతి జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): కోర్టు ధిక్కరణ కేసులో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిని వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందిగా ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఫార్మసీ కాలేజీల దరఖాస్తు రుసుము మూడు రెట్లు పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులను కాలేజీల యాజమాన్యం హైకోర్టులో సవాల్ చేసింది. అయితే ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అమలు చేయలేదు. దీంతో కాలేజీల యాజమాన్యాలు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండయాపై కోర్టు ధిక్కరణ కేసు వేసింది. ఈ కేసుపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశాలను అమలు జరపకపోవడంపై ఫార్మసీ కౌన్సిల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్‌ను వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాల్సిందిగా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేస్తూ.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# పట్టణాలు దేశ ప్రగతికి మెట్లు



**-రాష్ట్ర జనాభా లో పట్టణాల్లో 47.6 % జనాభా**
**- ఇది దేశ పట్టణ జనాభా కన్న 12 .5 % అధికం**
**-పట్టణ ప్రగతి కార్యక్రమానికి ఇప్పటి వరకు రూ.4537 .79 కోట్లు విడుదల**
**91 % నిధులు ఇప్పటి వరకు వినియోగం**
**రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థలకు 2022 స్వచ్ సర్వేక్షన్ అవార్డు**
**ఇండియన్ స్వచ్ఛత లీగ్ - 2022 అవార్డు గెలుచుకున్న 3 పట్టణ స్థానిక సంస్థలు**
**పట్టణీకరణలో దేశంలో రెండవ స్థానం**
**ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన హైదరాబాద్**
**దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ పట్టణాలు**



హైదరాబాద్, జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పట్టణాలు దేశ ప్రగతికి మెట్లు. పిల్లల చదువుల కొరకు, ఆరోగ్య అవసరాలకు, జీవనోపాధికి, ఉన్నత జీవన విధానాలకు ప్రజలు పట్టణాలకు తరలి వస్తుంటారు. దేశ జనాభాలో 35 .1 % పట్టణాల్లో నివసిస్తుండగా తెలంగాణ రాష్ట్రంలో 47.6 % జనాభా పట్టణాల్లో నివసిస్తున్నారు. ఇది దేశ పట్టణ జనాభా కన్నా 12 .5 % అధికం. పెరుగుతున్న జనాభా, మారుతున్న కాలానికి అనుగుణంగా పట్టణాలు అభివృద్ధి చేయడం ఛాలంజ్ లాంటిది. పట్టణాల సమగ్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కలిపిస్తా నివాసయోగ్యమైన వాతావరణాన్ని కలిపించాలని 2020లో పట్టణ ప్రగతి పేరిట వినూత్నమైన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ పట్టణం తో పాటు అన్ని నగరాలు పట్టణాల అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. నేడు రాష్ట్ర పట్టణాల రూపు రేఖలే మారిపోయాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు దిశానిర్దేశంలో, పురపాలక శాఖ మంత్రి తారక రామా రావు నేతృత్వంలో 9 సంవత్సరాల్లోనే తెలంగాణ పట్టణాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించి పురోగమిస్తున్నాయి. కేంద్రం నుండి 23 పట్టణ స్థానిక సంస్థలకు స్వచ్ సర్వేక్షణ్ అవార్డులు, 3 పట్టణ స్థానిక సంస్థలకు ఇండియన్ స్వచ్ఛత లీగ్ అవార్డులు లభించాయి. పట్టణీకరణలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం రెండవ స్థానంలో నిలిచింది. ఆసియా పసిఫిక్ స్థిరత్వ సూచిక 2021 ప్రకారం హైదరాబాద్ ఆసియా పసిఫిక్ ప్రాంతం లోని మొదటికి 20 స్థానాలలో స్థిరమైన నగరంగా పేర్కొన్నది అదేవిధంగా భారతీయ నగరాల్లో మూడవ స్థానంలో వుంది. ఐక్య రాజ్య సమితిలోని అర్బర్ డే ఫౌండేషన్ మరియు ఆహార ఒ వ్యవసాయ సంస్థ వరుసగా రెండు ఏండ్లు హైదరాబాద్ ను ప్రపంచ వృక్ష నగరం-2021 గుర్తించింది. దక్షిణ కొరియాలోని జెజులో నిర్వహించిన అంతర్జాతీయ ఉద్యానవన ఉత్పత్తుల సంఘం హైదరాబాద్ కు ప్రపంచ హరిత నగరం 2022 అవార్డు ను ప్రకటించింది. ఇలా రాష్ట్రం అనేక అవార్డులు కైవసం చేసుకుంటోంది. ఇతర రాష్ట్రాల బృందాల అధ్యయనం చేసేందుకు రాష్ట్రానికి వచ్చే స్థాయికి తెలంగాణ ఎదిగింది.

రాష్ట్రము లో 129 మున్సిపాల్టీలు, 12 కార్పొరేషన్ లు, జి హెచ్ ఎం సి తో కలిపి మొత్తం 142 పట్టణ ప్రాంతాల్లోని 3618 వార్డులలో కోటి నలభై నాలుగు లక్షల జనాభా నివసిస్తోంది. పట్టణాల సర్వతోముఖాబి వృద్ధికి చేపట్టిన పట్టణ ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.4537 .79 కోట్లు విడుదల చేయగా ఇప్పటికే రూ.4138 .84 కోట్ల నిధులని ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణాలలో మౌలిక సదుపాయాలు , రోడ్ల విస్తరణ, కాలువల నిర్మాణం నిర్వహణ , విద్యుత్ దీపాలు, పార్కుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ , హరిత హారం, డంపింగ్ యార్డ్స్, వ్యర్థాల రీసైక్లింగ్, వైకుంఠధామాలు, ఓపెన్ జిమ్, క్రీడా ప్రాంగణాలు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్స్,సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్లు , సకాలంలో నిధులు విడుదల తదితర అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలంగాణ పట్టణాలు విరాజిల్లుతున్నాయి. ఏ ఆసరా లేని అనాధలకు ఆశ్రయం కల్పించేందుకు 30 షెల్టర్లను ఏర్పాటు చేసింది. విద్యుత్ ఆదా చేసే ప్రయత్నంలో 9,11,234 ఎల్ఈడి వీధి దీపాలను ఏర్పాటు చేసి ఏడాదికి రూ.128 కోట్ల విద్యుత్ బిల్లులను ప్రభుత్వం ఆదా చేసింది.

పారిశుధ్యం:

ఆరోగ్య జీవన విధానంలో పారిశుధ్యం ప్రధానమైనది. రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జిహెచ్ఎంసి మినహా ఇతర పట్టణ స్థానిక సంస్థలలో చెత్త రవాణాకు 4713 వాహనాలు ఏర్పాటు చేసి రోజుకు 4356 టన్నుల చెత్తను తరలిస్తున్నారు. ఇందుకు వివధ ప్రాంతాలలో 1233 .27 ఎకరాలలో 141 డంపింగ్ యార్డ్స్ ను ఏర్పాటు చేసారు. ఘన వ్యర్థ పధార్థాల నిర్వాహణకు 229 కంపోస్ట్ షెడ్స్ ను ఏర్పాటు చేసి ఎరువు తయారుచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 100 % చెత్తను సేకరిస్తున్న రాష్ట్రంగా తెలంగాణను ప్రకటించింది. . 141 పట్టణ స్థానిక సంస్థలలో రూ.428 .02 కోట్లతో 139 మానవ వ్యర్థాల ట్రీట్మెంట్ ప్లాంట్స్ ను ఏర్పాటు చేసారు, మరో 14 నిర్మాణంలో ఉ న్నాయి.

రాష్ట్రం హరితవనం:

పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన హరితహారం కార్యక్రమం కింద 3618 వార్డులలో 1612 నర్సరీలను ఏర్పాటు చేసారు. ఈ ఏడాది 214,91 లక్షల మొక్కల లక్ష్యం కాగా ఇప్పటికే నర్సరీలలో 248.38 లక్షల మొక్కలను పెంచుతున్నారు. గత ఏడాద నిర్దేశించుకున్న 251 .60 మొక్కల లక్ష్యానికి మించి 252 .27 మొక్కలను 141 పట్టణ స్థానిక సంస్థలలో నాటి 100 % లక్ష్యాన్ని పూర్తి చేసారు. 2818 పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా ఈ ఏడాది మార్చి చివరి నాటికి రోడ్లకు ఇరువైపులా 1208.52 కిలోమీటర్ల మేర 19.98 లక్షల మొక్కలను నాటారు. 2020 -21 నుండి 2023 -21 వరకు మొత్తం రూ.778 .33 కోట్ల గ్రీన్ బడ్జెట్ ను కేటాయించారు. ఉద్యోగులు , వ్యాపారాలు గత ఏడాది రూ.143.25 లక్షలు హరిత నిధికి జమ చేసారు.

ఆహ్లాదం ఆరోగ్యం:

ప్రజల ఆరోగ్యం అదే విదంగా ఆహ్లాదానికి పార్క్ లతో పాటు 368 ఓపెన్ జిమ్స్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదేవిధంగా 1273 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసింది.

వెజ్ నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు:

ప్రజలకు అనుకూలంగా ఒకే చోటు కూరగాయలు పండ్లు, పూలు, మాసం, చేపలు లభించాలని ఉద్దేశంతో రూ.500 కోట్ల బడ్జెట్ ను కేటాయించి సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. 25 వేల కన్నా ఎక్కువ జనాభా ఉన్న 57 పట్టణాల్లో ఒక్కోటి రెండు కోట్లతో, 25 వేల కన్నా అధికంగా ఉన్న 81 పట్టణాల్లో రూ.4.50 కోట్లతో ఈ మార్కెట్లను నిర్మిస్తున్నారు.

వైకుంఠధామాలు:

మనిషి చనిపోయాక గౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహించాలనే సంకల్పంతో వైకుంఠ రథాలు, వైకుంఠధామాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 141 పట్టణ స్థానిక సంస్థలలో 453 లక్ష్యంగా ఇప్పటికే 304 వైకుంఠధామాలు నిర్మించారు. 176 వైకుంఠ రథాలను ఏర్పాటు చేసారు. తెలంగాణ రాష్ట్రంలో పురపాలక శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల దేశ వ్యాప్తంగా ఆకట్టుకుంటున్నాయి. ఇతర రాష్ట్రాల బృందాలు అధ్యయనం చేసేందుకు రాష్ట్రానికి వచ్చే స్థాయికి తెలంగాణ పట్టణాలు ఎదిగి అభివృద్ధికి చిహ్నాలుగా మారాయి.

# రక్తదాతను సన్మానించిన ఎంపీ రవిచంద్ర



ఖమ్మం, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి): హ్యాపీ లివింగ్స్ గ్రూపు ఎండీ, సీఇవో పుల్లేటి శ్రీనుబాబు ఇప్పటి వరకు 73సార్లు రక్తదానం చేశారు. సన్నిహితుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శ్రీనుబాబును బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసానికి సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వకంగా అభినందించారు.

ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు,నటుడు సూర్యతేజ, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, సంఘం ప్రముఖులు ఆర్వీ మహేందర్, శ్రీనుబాబు సన్నిహితులు రంగయ్య నాయుడు, విజయ్, మహేష్ తదితరులు ఉన్నారు.

# వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుంది

**-ఆ పార్టీ అధినేత చంద్రబాబు ధీమా**

కుప్పం జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. హంద్రీనీవా పూర్తి చేసి నీళ్లిచ్చే బాధ్యత టీడీపీదేనని ఆయన స్పష్టం చేశారు. పేదలను ధనికుల్ని చేసే బాధ్యత తీసుకుంటానని పునరుద్ఘాటించారు. కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీళు ఇస్తామని వాగ్దానం చేశారు. కుప్పానికి తొలిసారిగా ఇజ్రాయెల్ టెక్నాలజీ తీసుకువచ్చానని, ఇక్కడ ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. "అభివృద్ధికి మారుపేరు తెలుగు దేశం పార్టీ. సైకిల్ ముందు చక్రం సంక్షేమం.. వెనుక చక్రం అభివృద్ధికి గుర్తు. రెండు చక్రాలు నడిస్తేనే అభివృద్ధి పథంలో సాగుతాం. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ సైకిల్‌తో టీడీపీ జోరు పెంచుతాం. అభివృద్ధి, సంక్షేమానికి తోడుగా మరిన్ని కార్యక్రమాలు చేపడుతాం" అని చంద్రబాబు అన్నారు.

ఏపీని దోచేస్తున్నారని ధ్వజమెత్తారు. 2019 నుంచే విధ్వంసం మొదలైందని దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో పరిపాలన పడకేసిందని, పది రూపాయలు ఇచ్చి రూ.100 దోచేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్, ఆర్టీసీ, గ్యాస్ ధరలు భారీగా పెంచారని తెలిపారు. వైసీపీ నేతలు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కూడా లేదని, ఇసుక, మద్యం, గనుల దోపిడీ, భూ కబ్జాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నారని, ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం గ్రానైట్‌ను కొల్లగిడితే టీడీపీ అడ్డుకుందని చంద్రబాబు గుర్తుచేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్యం లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజల ఆదరణ జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేనని చెప్పారు. మళ్లీ జన్మ ఉంటే మీ సేవకుడిగానే పుడతానని ప్రకటించారు. టీడీపీని 9 సార్లు గెలిపించిన ఘనత కుప్పానికే దక్కిందన్నారు. గతంలో ఇంటింటికీ 2 ఆవులు ఇస్తానన్న హామీ నెరవేర్చానని, ఇంటింటా పాల ఉత్పత్తి పెరిగి ఆదాయం సమకూరిందని చంద్రబాబు తెలిపారు.

# నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్:డిఎస్పీ నాగేంద్రచారి.



రాజన్న సిరిసిల్ల, జూన్ 15:(నేటినిజం ప్రతినిధి): నేరాల నియంత్రణనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుంది అని అందులో భాగంగానే ×జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశానుసారంకమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం× నిర్వహిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నాం అని వేములవాడ డిఎస్పీ నాగేంద్రచారి అన్నారు.గురువారం ఉదయం 60 మంది పోలీసులతో వేములవాడ రూరల్ పరిధిలోని తుర్కాశి నగర్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు,05 ఆటో లు సీజ్ చేసి సరైన పత్రాలు చూపించి తీసుకవేళ్ళవచ్చు అని గ్రామ శివారులో లభ్యమైన వలలు నెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఉన్నది ప్రజల రక్షణకే అని, ప్రజలకు పోలీసులు భద్రత, భరోసా కల్పించ దానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతా యన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తు లు అనుమానాస్పదంగా కనిపిస్తే, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చాలామంది యువకులు ఆన్లైన్ మోసాలకు బలవుతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని యువ తకు అవగాహన కల్పించారు. యువత చెడు అల వాట్లకు దూరంగా ఉంటూ, గ్రామాభివృద్ధికి పాటు పడాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా 100కు ఫోన్ చేయాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు సరైన ధ్రువపత్రాలతో పాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఒకసారి పోలీసు కేసు నమోదు అయితే ప్రైవేట్ జాబ్ కూడా రాలేని పరిస్థితి ఉంటుందన్నారు.గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ. కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ బన్సీలాల్, ఎస్.ఐ లు మహేందర్, రమాకాంత్, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు..

# ఈ నెల 17న, 4వ జాతీయ జల పురస్కారాలు ప్రదానం చేయనున్న ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 15:కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'జల వనరులు, నదుల అభివృద్ధి ఒ గంగానది పునరుజ్జీవన విభాగం', ఈ నెల 17న ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో, భారత ఉప రాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్‌ఖర్ 4వ జాతీయ జల పురస్కారాలను ప్రదానం చేస్తారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ప్లీనరీ హాల్‌లో అవార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. 2022 కోసం, 11 విభాగాల్లో ఉమ్మడి విజేతలు సహా మొత్తం 41 మంది విజేతలను కేంద్ర విభాగం ప్రకటించింది. ప్రతి విజేతకు ప్రశంస పత్రం, జ్ఞాపిక, నగదు బహుమతిని అందజేస్తారు.

ఉత్తమ రాష్ట్రంగా ప్రథమ బహుమతిని మధ్యప్రదేశ్ గెలుచుకుంది. ఉత్తమ జిల్లాగా ఒడిశాలోని గంజాం జిల్లా నిలిచింది. ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జగన్నాథపురం గ్రామ పంచాయతీకి ఇస్తారు. ఉత్తమ పట్టణ స్థానిక సంస్థ అవార్డు చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అందజేస్తారు. ఉత్తమ మీడియా పురస్కారం గురుగావ్‌కు చెందిన 'అడ్వాన్స్ వాటర్ డైజెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్'కు ప్రదానం చేస్తారు. ఉత్తమ పాఠశాలగా గుజరాత్‌లోని మెహసానాలోని జమియత్‌పురా ప్రాథమిక పాఠశాల నిలిచింది. ప్రాంగణ వినియోగంలో ఉత్తమ నన్న పురస్కారాన్ని జమ్ముఒకశ్మీర్‌లోని శ్రీ మాతా వైష్ణోదేవి పుణ్యక్షేత్రం దక్కించుకుంది. బిహార్‌లోని బెగుసరాయ్‌లోని బరౌని బొగ్గు విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి ఉత్తమ పరిశ్రమ అవార్డు ప్రదానం చేస్తారు. ఉత్తమ ఎన్‌జీవోగా రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న అర్పన్ సేవా సంస్థాన్ నిలిచింది. ఉత్తమ నీటి వినియోగదార్ల సంఘం అవార్డును గుజరాత్ నర్మదలోని సంజీవని పియత్ సహకారి మాండ్లీ లిమిటెడ్‌కు ప్రదానం చేస్తారు. సీఎస్ఆర్ కార్యక్రమాల్లో ఉత్తమ పరిశ్రమగా ఉత్తరప్రదేశ్ నోయిడా కేంద్రంగా పని చేస్తున్న హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిలిచింది.

4వ జాతీయ జల పురస్కారాలు, 2022 విజేతల జాబితా చూడటానికి ఇక్కడ క్లిక్ చేయండి

'జల్ సమృద్ధ్ భారత్' లేదా 'జల సంపన్న భారత్' అనే ప్రభుత్వ దార్శనికతను సాకారం చేయడానికి దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా, జలాభివృద్ధి కోసం పాటుపడుతున్న వ్యక్తులు ఒ సంస్థలను గుర్తించి, వారి ప్రయత్నాలను ప్రోత్సహించడానికి జాతీయ జల పురస్కారాలు ఇస్తున్నారు. ఇవి, నీటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించి, ఉత్తమ జల వినియోగ పద్ధతులు పాటించేలా ప్రేరేపిస్తాయి. బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవడానికి, జల వనరుల సంరక్షణ ఒ నిర్వహణ పనుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచడానికి ఈ కార్యక్రమం అవకాశాన్ని అందిస్తుంది.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, జాతీయ స్థాయిలో జల నిర్వహణ ఒ సంరక్షణ గురించి అవగాహన కల్పించడానికి సమగ్ర ప్రచారాన్ని జల్ శక్తి మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. దేశంలో నీటి వనరుల నిర్వహణకు సమగ్ర విధానాన్ని అవలంబించేందుకు, వివిధ వర్గాలను ప్రోత్సహించే లక్ష్యంతో, సమీకృత జాతీయ జల పురస్కారాలను ప్రకటించడం అవసరమని భావించారు. ఈ ప్రకారం, 1వ జాతీయ జల పురస్కారాలను 2018లో ప్రారంభించారు. 2019, 2020 సంవత్సరాలకు 2వ, 3వ జాతీయ జల పురస్కారాలను అందించారు. కొవిడ్ మహమ్మారి కారణంగా 2021 సంవత్సరంలో అవార్డులు ఇవ్వలేదు.

2022 సంవత్సరానికి, 4వ జాతీయ జల పురస్కారాల కోసం దరఖాస్తు ప్రక్రియను హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో 2022 జులై 30న ప్రారంభించారు. చివరి తేదీ అయిన 2022 అక్టోబర్ 31 నాటికి 868 దరఖాస్తులు అందాయి. దరఖాస్తులను పరిశీలించి, వడపోశారు. వడపోత తర్వాత మిగిలిన దరఖాస్తులను కేంద్ర జల కమిషన్, కేంద్ర భూగర్భ జల బోర్డు అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. చివరగా, 11 విభాగాల్లో ఉమ్మడి విజేతలు సహా 41 మందిని పురస్కారాల కోసం ఎంపిక చేశారు.

# శాస్త్రజ్ఞుడు డాక్టర్ గోలి మోహన్‌ను అభినందించిన ఒమన్ (మస్కట్)అగ్రికల్చర్ మినిస్టర్ ప్రశంస

**- ప్రపంచ ఐటీ మహాసభలకు హాజరైన డాక్టర్ గోలి మోహన్ , ఒమన్ అగ్రికల్చర్ మినిస్టర్ హల్మదాన్ హల్కి**



రాజన్న సిరిసిల్ల, జూన్ 15:(నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్ లో జరుగుతున్నప్రపంచ తెలుగు ఐటి మహా సభలకు ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ యువత సరైన సమయాన్ని అద్భుతాలు సృష్టించే విధంగా ఇన్నోవేషన్ థాట్స్ తో ముందుకు వెళితే అద్భుతాలు సృష్టించవచ్చని ఇప్పుడున్న పరిస్థితుల్లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ రంగంలో నూతన ఇన్నోవేషన్ థాట్స్ అవసరమని దానికి తగినట్లుగా రైతులు ప్రతిఫలం పొందుతారని యువత ఇటువంటి నూతన ఆలోచన ద్వారా మన దేశానికి కానీ రాష్ట్రానికి గాని ఇన్వెస్టర్స్ ముందుకు వస్తారని తద్వారా రైతులకు లాభంచేకూరుతుందని భారతదేశానికి వ్యవసాయ రంగం ప్రధాన ఆదాయ వనరు అని తద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. మస్కట్ అగ్రికల్చర్ మినిస్టర్ అలాందా హల్కి మాట్లాడుతూ తెలంగాణలో నూతనంగా ప్రయోగిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కినోవా సీడ్ను ఎగుమతి చేస్తే మేము కూడా మా దేశంలో వ్యవసాయ రంగంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తోడ్పాటు అవుతుందని అంతర్జాతీయ వేదిక ద్వారా డాక్టర్ గోలి మోహన్ ని కోరడం దానికి తగినట్లు డాక్టర్ గోలి మోహన్ స్పందించి సహకరిస్తానడం పట్ల మస్కట్ అగ్రికల్చర్ మినిస్టర్ హల్కి డాక్టర్ గోలి మోహన్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జన్మదినం సందర్భంగా క్షయ వ్యాధి కిట్స్ పంపిణీ



హైదరాబాద్ జూన్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్(;కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జన్మదినం సందర్భంగా రెడ్ క్రాస్ మరియు కీర్తి రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యం లో క్షయ వ్యాధి కిట్స్ పంపిణీ : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ సౌజన్యం తో కీర్తి రెడ్డి ఫౌండేషన్ వారి సహకారంతో స్టేట్ టిబి కన్వీనర్ డా. విజయ్ భాస్కర్ గౌడ్ గారి అధ్వర్యంలో యూసుఫ్ గూడ, శ్రీ రామ్ నగర్ కాలనీ, క్షయ వ్యాధి సెంటర్ లో రెడ్ క్రాస్, హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి మరియు కీర్తి రెడ్డి ఫౌండేషన్ ఛైర్ పర్సన్ కీర్తి రెడ్డి గార్ల చేతుల మీదుగా క్షయ వ్యాధి పేషెంట్ లకు క్షయ వ్యాధి పౌష్టికాహార కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టిబి వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

అంతే కాకుండా సేవాభావం ను కూడా అలవాటు చేసుకోవాలని కోరారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి క్షయ వ్యాధి రోగులు ను ఆదుకోవాలని తెలిపారు. కీర్తి రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ గారి ఆలోచన విధానాన్ని ముందు కు తీసుకెళ్ళి రాష్ట్రంలో 2024 సంవత్సరనీ చివరకు మన రాష్ట్రం లో ఒక్క క్షయ వ్యాధి పేషెంట్ లేకుండా చేస్తామని తెలిపారు. మాకు ఇలాంటి సహాయ సహకారాలు అందిస్తున్న రెడ్ క్రాస్, హైదరాబాద్ జిల్లా శాఖ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్ నగర్ టిబి సూపర్ వైజర్ కిషన్ రెడ్డి, శ్రీ రామ్ నగర్ టిబి స్టాఫ్, వెంకట్ మరియు రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

